జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం








కృష్ణ | శుక్రవారం 31 జూలై 2026 | సంపుటి : 01 | సంచిక : 141 | పేజీలు : 12 | వెల : 4/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఆషాఢ మాసం, గ్రీష్మ ఋతువు, దక్షిణాయణం సూర్యోదయం: 5:39 । సూర్యాస్తమయం: 6:28 చంద్రోదయం: 7:47 । చంద్రాస్తమయం: 6:51 తిథి: బహుళ విదియ రా. 9:08 వరకు, తదుపరి తదియ నక్షత్రం: ధనిష్ఠ రా. 7:14 వరకు, తదుపరి శతభిషం యోగం: సౌభాగ్యం రా. 12:38 వరకు, తదుపరి శోభ కరణం: తైతిల ఉ. 8:45 వరకు, తదుపరి గరజి రా. 9:08 వరకు, తదుపరి వణిజ

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## పశ్చిమాసియా సంక్షోభంపై
# కేంద్రం అలర్ట్

- ఇంధన భద్రత, భారతీయుల రక్షణపై మోదీ కీలక ఆదేశాలు
- పశ్చిమాసియా పరిస్థితిపై నాలుగోసారి కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశం
- ఇంధనం, ఎరువుల సరఫరాపై సమీక్ష, సముద్ర నావికుల భద్రతకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచన



## దళారుల మాటలు నమ్మి
# మోసపోవద్దు

- విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశం
- విద్యుత్ శాఖకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని గొట్టిపాటి సూచన
- అదనపు సిబ్బందిని క్షేత్రస్థాయిలో నియమించాలని ఆదేశం
- విద్యుత్ నష్టాలు అరికట్టేందుకు భూగర్భలైన్లు వేస్తున్నామని మంత్రికి వివరించిన అధికారులు



**అమరావతి**

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ - మిగతా3లో

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభానికి
# కౌంట్‌డౌన్

- ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం
- రూ.17,883 కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- సభకు 3 లక్షల మంది వస్తారని అంచనాతో సన్నాహాలు



**అమరావతి**

ఉత్తరాంధ్ర ప్రగతి ప్రయాణంలో నవశకానికి నాంది పలుకుతూ ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం ప్రారంభానికి కౌంట్‌డౌన్ మొదలైంది. మెగా గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం కానుంది. అదేరోజు మరో 17 వేల 883 కోట్ల రూపాయల విలువైన ఇంధన, ఉపరితల రవాణా శాఖల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ ఈవెంట్‌ను ప్రజల పండుగలా నిర్వహించాలని భావిస్తున్న ప్రభుత్వం విమానాశ్రయ ప్రాధాన్యతను వివరిస్తూ "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" అనే ప్రత్యేక థీమ్‌తో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పిస్తోంది. ఉత్తరాంధ్ర ప్రజల కల సాకారమయ్యేందుకు సమయం ఆసన్నమైంది. భోగాపురంలో 5 వేల 641 కోట్లతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న జాతికి అంకితం చేస్తారు. ఎయిర్‌పోర్టుతో పాటు 17 వేల 883 కోట్ల - మిగతా3లో



## విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం

- రాజ్యసభకు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు
- కేంద్రంపై ప్రతిపక్ష నేత ఖర్గే విమర్శలు
- అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్
- రాజకీయాల కోసమే బిల్లు తెచ్చారని ఆరోపణ
- పేపర్ లీక్‌లపై అమలు వ్యవస్థ బలోపేతం చేయాలని సూచన
- విద్యార్థుల ఉద్యమం వల్లే ప్రభుత్వం దిగివచ్చిందన్న ఖర్గే

# పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం

- రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు
- రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం
- గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా
- జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
- ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు
- సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్



# గ్లోబల్ ఇన్వెస్టర్లంతా ఏపీ వైపు చూస్తున్నారు

- కర్నూలు జిల్లా లోకేశ్ పర్యటన
- పత్తికొండ మండలం హోసూరులో టాటా పవర్, సుజలాన్ కంపెనీల రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- రాష్ట్ర విశ్వసనీయతను పునరుద్ధరించడం వల్లే కంపెనీలు ఏపీకి క్యూకట్టాయన్న లోకేశ్



**అమరావతి**

గ్లోబల్ ఇన్వెస్టర్లంతా ఏపీ వైపు చూస్తున్నారని మంత్రి నారా లోకేశ్? పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, ఈక్యూటీ, టీపీజీ వంటి గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. పునరుత్పాదక ఇంధన సంస్థలు ఆంధ్రప్రదేశ్‌కు క్యూ కడుతున్నట్లు తెలిపారు. రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఏసీఎంఈ, వారీ వంటి ప్రముఖ కంపెనీలన్నీ రాష్ట్రంలో ఇప్పటికే తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు లోకేశ్ వెల్లడించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా లోకేశ్ కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరులో రెండు భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ చేపట్టిన 800 మెగావాట్ల సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. - మిగతా3లో

# ఈ20 పెట్రోల్ వాహనాలకు సురక్షితమే

- ఇంజిన్ దెబ్బతినదు కానీ మైలేజ్ తగ్గొచ్చు!'– కేంద్రం కీలక ప్రకటన
- ఈ20 పెట్రోల్ వల్ల వెహికిల్ ఇంజిన్‌కు నష్టం లేదన్న కేంద్రం
- 20 కోట్ల బైకులు, 3 కోట్ల కార్లలో సమస్యల్లేవని స్పష్టం
- కొన్ని వాహనాలకు మైలేజ్ స్వల్పంగా తగ్గొచ్చని క్లారిటీ– వందేమాతరం బిల్లు ఆమోదం





## యువతకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకమే కీలకం

- కేంద్రం ఆ హామీలను నిలబెట్టుకుంటే సంతోషం: వాంగ్‌చుక్
- వందే భారత్ ప్రయాణాన్ని ప్రశంసించిన సోనమ్ వాంగ్‌చుక్
- విద్యార్థులపై ఎఫ్‌ఐఆర్‌లు పెట్టొద్దంటూ కేంద్రానికి విజ్ఞప్తి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దిప్కే డిమాండ్

## చంద్రబాబువి అన్నీ దుర్మార్గపు
# ఆలోచనలే

- 'ఈ రోజు రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు జరగుతున్నాయనే దానికి ఇదే నిదర్శనం
- కనీసం మానవతా విలువలు లేకుండా మంచితనానికి పాతరేశారు
- నీట్ రాసి.. తన తండ్రిలాగా డాక్టర్ అవ్వాలని అనుకున్నాడు సీదిరి కుమారుడు
- బీసీల్లో సీదిరి మంచి నాయకుడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కాబట్టి. చిన్న పిల్లాడు చేసిన యాక్సిడెంట్‌ను కుట్రగాను. హత్యగాను చిత్రీకరించి సీదిరి కుటుంబాన్ని ఇరికించే కార్యక్రమం ఎంతవరకు ధర్మం.
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



**శ్రీకాకుళం**

మాజీ మంత్రి సీదిరి అప్పల రాజు కుటుంబంపై చంద్రబాబు సర్కార్ కుట్రకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. యాక్సిడెంట్‌ను హత్య కేసుగా మార్చి సీదిరి కుటుంబంపై కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందన్నారు. అసలు యాక్సిడెంట్ కేసును హత్య కేసుగా ఎలా మారుస్తారు? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. అంపోలు జైలులో ఉన్న సీదిరిని పరామర్శించేందుకు వెళ్లిన వైఎస్ జగన్.. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి సర్కారు అరాచకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ - మిగతా3లో

# పశ్చిమాసియా సంక్షోభంపై కేంద్రం అలర్ట్



దేశ ప్రయోజనాలు, ఇంధన భద్రత, విదేశాల్లోని భారతీయుల రక్షణకు ఎలాంటి ఆటంకం కలగకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు వేగవంతం చేసింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం దిల్లీలో కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) నాలుగో ప్రత్యేక సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రస్తుత భౌగోళిక-రాజకీయ పరిస్థితులు, వాటి ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉండొచ్చన్న అంశాలపై సమగ్రంగా చర్చించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా హోల్ ఆఫ్ గవర్నమెంట్ విధానాన్ని కొనసాగించాలని ప్రధాని స్పష్టం చేశారు. సమావేశంలో కేబినెట్ కార్యదర్శి ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులపై వివరించారు. ముఖ్యంగా పశ్చిమాసియా ఘర్షణలు, ఎర్ర సముద్రం, హర్మూజ్ జలసంధి, గల్ఫ్ ఆఫ్ ఏడెన్, బ్లాక్ సీ ప్రాంతాల్లో నెలకొన్న భద్రతా సమస్యలు భారత దిగుమతులు, సరఫరా వ్యవస్థపై చూపుతున్న ప్రభావాన్ని వివరించారు. ఈ నేపథ్యంలో పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్ఎన్జీ, ఎల్పీజీ, ఎరువుల సరఫరా అంతరాయం లేకుండా కేంద్రం చేపట్టిన చర్యలను కూడా వివరించారు. ప్రస్తుతం దేశంలో పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు, సరఫరా పరిస్థితి సంతృప్తికరంగానే ఉందని సమావేశంలో వెల్లడించారు. ముడి చమురు లభ్యత సమృద్ధిగా ఉండటంతో ప్రభుత్వ రంగ రిఫైనరీలు 100 శాతానికి పైగా సామర్థ్యంతో పనిచేస్తున్నాయని తెలిపారు. దీంతో పెట్రోల్, డీజిల్ తదితర ఇంధన ఉత్పత్తుల తయారీ నిరంతరాయంగా కొనసాగుతోందని వివరించారు.

**ఎల్?పీజీపై కేంద్రం ప్రత్యేక దృష్టి**

ఎల్పీజీ సరఫరాపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒకే దేశంపై ఆధారపడకుండా ఎల్పీజీ కొనుగోలు వనరులను ఇప్పటికే విస్తరించినట్లు అధికారులు తెలిపారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ల విస్తరణకు చర్యలు చేపట్టడంతో గ్యాస్ వినియోగం పెరుగుతోందని వెల్లడించారు. జాతీయ గ్యాస్ గ్రిడ్ విస్తరణ, ఎల్ఎన్జీ దిగుమతుల సామర్థ్య పెంపు, సిటీ గ్యాస్ పంపిణీ వ్యవస్థ విస్తరణ, పైప్లైన్ మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధి వంటి చర్యల ద్వారా ఎల్పీజీపై ఆధారాన్ని క్రమంగా తగ్గించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని సమావేశంలో చర్చించారు. రాబోయే రబీ సీజన్కు అవసరమైన ఎరువుల లభ్యతపైనా ప్రధాని ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అవసరమైన ఎరువుల నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ దిగుమతి వనరులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల సరఫరా నిరంతరాయంగా కొనసాగాలని స్పష్టం చేశారు. పశ్చిమాసియా ఘర్షణల ప్రభావం సముద్ర రవాణాపైనా పడుతున్న నేపథ్యంలో దేశీయ, విదేశీ నౌకల్లో పనిచేస్తున్న భారతీయ నావికుల భద్రతపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఘర్షణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సముద్ర నావికులకు, వారి కుటుంబాలకు అవసరమైన సమాచారం, అత్యవసర సహాయం, మానసిక పరామర్శ అందించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ అధికారులను ఆదేశించారు.

**ఇంధన వనరులపై మరింత దృష్టి**

విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రత కూడా కేంద్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య అంశమని ప్రధాని స్పష్టం చేశారు. పశ్చిమాసియా దేశాల్లో నివసిస్తున్న భారతీయుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు. దీర్ఘకాలిక ఇంధన భద్రత సాధించాలంటే పునరుత్పాదక ఇంధన వనరులపై మరింత దృష్టి పెట్టాలని కూడా ప్రధాని పేర్కొన్నారు. ముఖ్యంగా సౌరశక్తి, ఇతర శిలాజ ఇంధనేతర వనరుల వినియోగాన్ని వేగంగా పెంచడం ద్వారా విదేశీ ఇంధనంపై ఆధారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్తో పాటు ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్, షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్పూరీ హాజరయ్యారు. ఆయా శాఖలు తీసుకుంటున్న చర్యలపై మంత్రులు ప్రధానికి వివరించారు. ప్రస్తుతం భారత ఇంధన అవసరాల్లో 88 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. గతంలో దేశ ఇంధన దిగుమతుల్లో దాదాపు 40 శాతం హర్మూజ్ జలసంధి మార్గం ద్వారానే వచ్చేవి. అయితే ఆ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ఎర్ర సముద్రం, బాబ్ అల్-మందబ్ ప్రాంతాల్లో నౌకలపై దాడులు పెరగడంతో ప్రపంచ సరఫరా వ్యవస్థపై ప్రభావం కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో దేశ ప్రజల ప్రయోజనాలు, ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం కలగకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# ఈ20 పెట్రోల్ వాహనాలకు సురక్షితమే



ఈ20 పెట్రోల్ (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వల్ల వాహనాల ఇంజిన్లు త్వరగా దెబ్బతింటాయా తుప్పు పట్టి వాహనాల ఆయుష్షు తగ్గుతుందా? ఇటీవలి కాలంలో ఈ అంశంపై సోషల్ మీడియాలో, వాహనదారుల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం లోక్సభ వేదికగా దీనిపై స్పష్టత ఇచ్చింది. ఈ20 ఇంధనం వల్ల ఇంజిన్ భాగాలు అరిగిపోవడం, తుప్పు పట్టడం లేదా వాహనం కాల పరిమితి తగ్గడం వంటి సమస్యలేవీ తలెత్తడం లేదని ప్రభుత్వం సమర్థించుకుంది. ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం భారత్కు ఇంధన భద్రతను అందించడంతో పాటు అంతర్జాతీయ ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గుల ప్రభావం నుంచి సామాన్య వినియోగదారుల్ని కాపాడుతుందని పేర్కొంది. లోక్సభలో అడిగిన ఒక ప్రశ్నకు పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. నీతి ఆయోగ్, వాహన తయారుదారులు, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐఏఎం), ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థలు (ఓఎంసీఎస్), ఇతర సాంకేతిక సంస్థల సలహాలతో దశలవారీగా, శాస్త్రీయంగా ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్లు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విస్తృత ప్రయోగాలు, ఫీల్డ్ ట్రయల్స్లో ఈ20 ఇంధనం వాహనాలకు పూర్తి సురక్షితమని నిరూపితమైందని సురేశ్? గోపి వెల్లడించారు.

**'ఇంజిన్ విఫలమైనట్లు ఆధారాల్లేవ్'**

ఇప్పటికే దేశంలో 15 శాతం ఇథనాల్ కలిగిన ఈ15ం పెట్రోల్ 3 సంవత్సరాలకుపైగా, 19-20 శాతం ఇథనాల్ కలిగిన ఈ19-ఈ20 ఇంధనం రెండున్నర సంవత్సరాలకుపైగా వినియోగంలో ఉందని ప్రభుత్వం గుర్తుచేసింది. ఈ కాలంలో 20 కోట్లకుపైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకుపైగా పెట్రోల్ కార్లు ఈ ఇంధనంతో నడిచినా, ఇథనాల్ బ్లెండింగ్ కారణంగా ఇంజిన్ విఫలమైనట్లు ధ్రువీకరించిన ఆధారాల్లేవని తెలిపింది. ప్రభుత్వం ప్రకారం ఈ20 ఇంధనం ఎక్కువ ఆక్టేన్ వాల్యూ, మెరుగైన పనితీరు, తక్కువ కాలుష్యం వంటి ప్రయోజనాలు కలిగి ఉంది. దీంతో ఇంజిన్ మరింత సమర్థంగా పనిచేస్తుందని స్పష్టం చేసింది. ఇంకా పబ్లిక్ సెక్టార్ చమురు మార్కెటింగ్ కంపెనీలు రైతుల వద్ద ఇథనాల్ను మంచి మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నాయని ప్రభుత్వం వివరించింది. జు20 ఫ్యూయెల్ క్యాంపెయిన్ చమురు కంపెనీలకు లాభం కోసం కాకుండా ఇంధన భద్రత, ధరల్లో స్థిరత్వం, రైతుల సంక్షేమం, విదేశీ మారక నిల్వల ఆదా కోసం చేపట్టిన వ్యూహాత్మక చర్య అని తెలిపింది.

**'ఇంధన ధరల్ని పరిమితంగానే పెంచాం'**

భారతదేశం క్రూడ్ ఆయిల్ దిగుమతులపై అధికంగా ఆధారపడుతున్నందున ఆ భారాన్ని తగ్గించుకునేందుకు దేశీయంగా ఇథనాల్ మిశ్రమం వ్యూహాత్మకంగా కూడా కీలకం అని పేర్కొంది. మరోవైపు పశ్చిమాసియా సంక్షోభ సమయంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరిగినా, దేశీయంగా ఇంధన ధరలు పరిమిత స్థాయిలోనే పెరిగాయని కేంద్రం తెలిపింది. 2026 ఫిబ్రవరి నుంచి క్రూడ్ ధరలు 70-80 శాతం వరకు పెరిగినా దేశీయంగా 7-8 శాతం మాత్రమే పెంచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ముడి చమురు ధర గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు పెట్రోల్ ధర లీటరుకు రూ. 125 వరకు వెళ్లే అవకాశం ఉన్నా, దిల్లీలో వినియోగదారులకు రూ. 94.77 కే అందించినట్లు తెలిపింది.

**మైలేజ్ 2-6 శాతం వరకు తగ్గొచ్చు: నితిన్ గడ్కరీ**

ఇక జు20 పెట్రోల్ వాడితే వాహనాల మైలేజ్ 2 నుంచి 6 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లోక్సభలో తెలిపారు. ఇది వాహనం, మోడల్ను బట్టి ఉంటుందన్నారు. అంతే కానీ ఈ ఇంధనం వల్ల ఇంజిన్ దెబ్బతినడం, పనితీరు తగ్గడం లేదా ఇతర సాంకేతిక లోపాలు వచ్చినట్లు ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదని స్పష్టం చేశారు. ఈ20 పెట్రోల్తో మరింత మెరుగైన యాక్సిలరేషన్, సాఫీ రైడ్ క్వాలిటీ సహా కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు.

**వందేమాతరం బిల్లు ఆమోదం**

యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం తర్వాత రోజు కూడా లోక్సభలో వాయిదాలపర్వం కొనసాగింది. గురువారం ఉదయం 11గంటలకు సభ సమావేశం కాగానే వివిధ అంశాలపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. వెల్లోకి దూసుకెళ్లి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగనివ్వాలని స్పీకర్ ఓంబిర్లా కోరినప్పటికీ విపక్ష సభ్యులు నినాదాలు ఆపలేదు. సభలో గందరగోళ పరిస్థితులు నెలకొనటంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత తిరిగి సమావేశమైనా పరిస్థితిలో మార్పు లేకపోవటంతో మధ్యాహ్నం 3 గంటల వరకు మళ్లీ వాయిదావేశారు. ఆ తర్వాత తిరిగి సమావేశమైన లోక్సభ జాతీయ గేయం 'వందేమాతరం' అవమానాన్ని నివారించే బిల్లుపై స్వల్ప చర్చ తర్వాత ఆమోదించింది. అనంతరం లోక్సభ శుక్రవారానికి వాయిదాపడింది.

# యువతకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకమే కీలకం

నీట్- యూజీ ప్రశ్నాపత్రం లీక్ అంశంపై దిల్లీలోని జంతర్మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఉద్యమం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ కోరారు. ముఖ్యంగా ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్లు నమోదు చేయబోమని ఇచ్చిన హామీని తప్పకుండా నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ మేరకు ఎక్స్లో ఓ వీడియో పోస్టు చేశారు. 'భారతీయ రైల్వేపై నాకు ఎంతో గర్వంగా ఉంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అదే స్థాయిలో నిలబెట్టుకుంటే మరింత సంతోషిస్తాను' అంటూ వాంగ్చుక్ వ్యాఖ్యానించారు. దిల్లీ నుంచి లద్దాఖ్? తిరుగు ప్రయాణంలో వందే భారత్ ఎక్స్ప్రెస్లో ప్రయాణించిన ఆయన, తన అనుభవాన్ని పంచుకున్నారు. లద్దాఖ్?కు వెళ్లే మార్గంలో దిల్లీ- శ్రీనగర్ వందే భారత్లో ప్రయాణించిన వాంగ్చుక్, చినాబ్ రైల్వే వంతెనపై ప్రయాణం అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. "రైలు ప్రయాణం నాకు ఎప్పటినుంచో ఇష్టమైనది. ఆ ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా అనిపించింది. భారతీయ రైల్వే సాధించిన అభివృద్ధి నిజంగా ప్రశంసనీయం" అని ఆయన వీడియో సందేశంలో తెలిపారు. "యువతతో నమ్మకమైన సంబంధాన్ని ఏర్పరచుకోవడం ఏ ప్రభుత్వానికైనా చాలా ముఖ్యం. విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. ఆ మాటను నిలబెట్టుకోవాలి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది" కాగా, పార్లమెంట్లో ప్రజా పరీక్షల సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని ఆయన స్వాగతించారు. ఈ బిల్లు కేవలం పరీక్షల వ్యవస్థలోనే కాకుండా దేశ విద్యా వ్యవస్థలోనూ సమగ్ర మార్పులకు దారితీయాలని ఆకాంక్షించారు. గత నెలలో నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన 36 రోజుల ఉద్యమానికి సోనం వాంగ్చుక్ మద్దతు తెలిపారు. జూన్ 28 నుంచి ఆయన నిరాహార దీక్ష చేపట్టగా, ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేంద్రం ప్రధాన డిమాండ్లను అంగీకరించడంతో ఆయన తన దీక్షను విరమించారు.

**అమిత్ షా రాజీనామాకు దీప్కే డిమాండ్**

అదే సమయంలో సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే మరోసారి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జూలై 20న నిర్వహించిన సంసద్ చలో కార్యక్రమం సందర్భంగా విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని ఆరోపించారు. దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "విద్యార్థులపై బలప్రయోగానికి ఆదేశాలు అమిత్ షా నుంచే వచ్చి ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం ఇప్పుడు కేవలం ప్రతిపక్షాల బాధ్యత మాత్రమే కాదు. దేశ ప్రజలందరూ కలిసి రావాల్సిన అవసరం ఉంది" అని మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్లో మీడియాతో మాట్లాడుతూ దీప్కే అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. అలాగే కొత్త విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషిపై కూడా విమర్శలు చేశారు. యోగ గురువు బాబా రామ్దేవ్ చేసిన వ్యాఖ్యలపైనా దీప్కే స్పందించారు. జంతర్మంతర్ ఉద్యమం భారతీయ సంస్కృతిని దెబ్బతీసిందన్న రామ్దేవ్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. "మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రాలతో రాజ్యాంగబద్ధంగా ఉద్యమించడం సంస్కృతిని అవమానించడం ఎలా అవుతుంది? యువత దేశాన్ని, సంస్కృతిని చక్కగా ముందుకు తీసుకెళ్లగలదు" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, దిల్లీ పోలీసులు నిరసనల సమయంలో రాళ్లతో నిండిన ట్రక్కులను ఉద్యమ ప్రాంతానికి తీసుకొచ్చారని కూడా దీప్కే ఆరోపించారు.

## విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం



ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026పై రాజ్యసభలో తీవ్ర వాగ్వాదం జరిగింది. చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి జరిగిందని ఖర్గే ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు, సీఆర్పీఎఫ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనే పనిచేస్తాయని గుర్తు చేశారు. ఆ శాఖ అనుమతి లేకుండా ఇలాంటి చర్యలు జరిగే అవకాశం లేదని అన్నారు. ఈ ఘటనపై అమిత్ షా బాధ్యత నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై ఆయన సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే బిల్లును ఇంత ఆలస్యంగా ఎందుకు తీసుకొచ్చారని ఖర్గే ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే సంస్కరణలు చేయకుండా ప్రభుత్వం రాజకీయాల్లోనే నిమగ్నమైందని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలను చల్లార్చేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. బీజేపీ రాజకీయాల వల్లే దేశంలో ప్రశ్నపత్రాల లీకేజీలు, నిరసనలు, పోలీసు చర్యలు చోటుచేసుకున్నాయని అన్నారు. పేపర్ లీకేజీలు జరిగిన తర్వాత నష్టనివారణ చర్యలు తీసుకోవడం ఒక్కటే సరిపోదని ఖర్గే అభిప్రాయపడ్డారు. అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అమలు వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం అనుసరించబోయే స్పష్టమైన కార్యాచరణను వివరించలేదని విమర్శించారు. ఈ బిల్లు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా పరీక్షల వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేశారని ఖర్గే గుర్తుచేశారు. వారి గొంతుకను ప్రతిపక్షం వీధుల నుంచి పార్లమెంట్ వరకు వినిపించిందన్నారు. ప్రజల ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం చివరకు వెనక్కి తగ్గిందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల పోరాటం ఫలించిందని, వారి ఉద్యమం వల్లే ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. అధికారాన్ని కోల్పోతామన్న భయంతోనే ప్రభుత్వం డిమాండ్లకు తలొగ్గిందని ఆరోపించారు.

## పేపర్ లీక్లపై కేంద్రం ఉక్కుపాదం..



దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రపతి అంగీకారం లభించగానే ఇది చట్టంగా అమల్లోకి రానుంది. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రభుత్వం, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడీ వాదనలు జరిగాయి. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ జరిమానాలు, ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణలతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపింది. ఈ సవరణల ప్రకారం పేపర్ లీక్లకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జైలు శిక్షతో పాటు ఫాస్ట్ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తి చేసే నిబంధనలను కూడా చేర్చారు. పరీక్షల నిర్వహణలో అక్రమా లకు పాల్పడే ముఠాలపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని ప్రభుత్వం పేర్కొంది. 2024లో తీసుకొచ్చిన చట్టం అమలులో వచ్చిన అనుభవాల ఆధారంగానే ఈ సవరణలు రూపొందించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. ఆ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 52 ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయని చెప్పారు. పేపర్ లీక్ల కారణంగా ఆత్మహత్యల సంఖ్య కూడా తగ్గిందని సభకు వివరించారు. అయితే ప్రతిపక్షం మాత్రం బిల్లుపై విమర్శలు గుప్పించింది. కేవలం శిక్షలు పెంచడం సరిపోదని, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు విద్యార్థుల ప్రయోజనాల కోసం కేంద్రం వేగంగా చర్యలు తీసుకుందని అధికార పక్షం పేర్కొంది. మాజీ విద్యాశాఖ మంత్రి రాజీనామా, నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్ఫోర్స్ ఏర్పాటు, నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం వంటి చర్యలను ప్రస్తావించింది.

## దేశంలో అడుగు పెట్టిన వెంటనే హసీనాను అరెస్ట్ చేస్తాం.. బంగ్లా మంత్రి హెచ్చరిక!

స్వదేశానికి వెళ్లాలనుకుంటున్నట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించిన నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం మరోసారి తన కఠిన వైఖరి వెల్లడించింది. దేశంలో అడుగుపెట్టిన క్షణమే ఆమెను అరెస్ట్ చేస్తామని ఆ దేశ న్యాయశాఖ మంత్రి ఎం.అసదుజ్జమాన్ స్పష్టం చేశారు. చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామని, ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండదని పేర్కొన్నారు. ఫ్రాన్స్కు చెందిన వార్తా సంస్థ ఏఎఫ్పీకి ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఈ ఏడాది డిసెంబర్లోగా స్వదేశానికి తిరిగి వెళ్తానని చెప్పారు. తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, హత్య కూడా చేయొచ్చని తెలుసని, అయినా ప్రజలు పిలుస్తున్నందున తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. గత నెలలో ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కూడా ఎన్ని అడ్డంకులు వచ్చినా బంగ్లాదేశ్కు వెళతానని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన న్యాయశాఖ మంత్రి, మరణశిక్ష పడిన వ్యక్తిగా హసీనాకు కోర్టులో నేరుగా లొంగిపోయే అవకాశం కూడా దక్కకపోవచ్చని అన్నారు. ఆమె బంగ్లాదేశ్ పౌరురాలిగా స్వదేశానికి వచ్చే హక్కు ఉన్నా, దేశంలోకి ప్రవేశించిన వెంటనే చట్ట ప్రకారం అరెస్ట్ చేస్తామని చెప్పారు. మధ్యంతర ప్రభుత్వం ఇప్పటికే షేక్ హసీనా పాస్పోర్టును రద్దు చేసింది. అలాంటప్పుడు ఆమె ఎలా వస్తారన్న ప్రశ్నకు అది ఆమె సమస్యని మంత్రి వ్యాఖ్యానించారు.

# భోగాపురం విమానాశ్రయం ప్రారంభానికి కౌంట్‌డౌన్

-మొదటిపేజీ తరువాయి
విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.
ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిలో రేచర్ల-గురవాయిగూడెం మధ్య 752 కోట్లతో పూర్తి చేసిన ప్యాకేజీ-4 పనులను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఇదే రహదారిలో గురవాయిగూడెం-దేవరపల్లి మధ్య డిజైన్ మార్పు చేసి రూ. 926 కోట్లతో పూర్తి చేసిన రోడ్డును ప్రారంభిస్తారు. రూ.160 కోట్లతో చీ౨-67లో పూర్తి చేసిన నాలుగు లేన్ల అనంతపురం జిల్లా తాడిపత్రి బైపాస్‌ను ప్రారంభిస్తారు. ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ పార్ట్‌ఏ, బీ ట్రాన్స్‌మిషన్ స్కీంలో భాగంగా 4 వేల 370 కోట్లతో చేపట్టిన అనంతపురం, కర్నూలు విండ్, సోలార్ ఎనర్జీ జోన్ ప్రాజెక్టులను ప్రారంభిస్తారు.

**శంకుస్థాపనల వివరాలివే:**
విశాఖ జిల్లా భీమిలి పరిధిలోని తర్లువాడలో ాూక్రా టెక్నాలజీస్ సెమీ కండక్టర్ ప్యాకేజింగ్, టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. దక్షిణకొరియాకు చెందిన ాూాూజు సంస్థ భాగస్వామ్యంతో ఈ యూనిట్ రూపుదిద్దుకుంటోంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం 30 ఎకరాలు కేటాయించింది. మొదటి దశలో 468 కోట్లతో చేపట్టే సెమీ కండక్టర్ యూనిట్‌కు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. 5 వేల 550 కోట్లతో 'పవర్ గ్రిడ్ కర్నూలు-4 ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్' చేపట్టబోయే ప్రాజెక్టు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. 16 కోట్లతో చీ౨-565లో పెంచలకోన-ఏర్పేడు మధ్య హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

**సభకు 3 లక్షల మంది వస్తారని అంచనా:**
ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేసేలా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. మహానాడు లాంటి భారీ సభలు నిర్వహించిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ



బాధ్యతలను నారా లోకేశ్ సారధ్యంలోని 13 కమిటీలకు అప్పగించారు. సభకు 3 లక్షల మంది జనం వస్తారన్న అంచనాలతో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా కూటమి ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

**13 వేల మందితో థింసా నృత్యం:**
భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభ వేడుక సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా ప్రభుత్వం వినూత్నంగా అవుట్‌రీచ్ కార్యక్రమాలను రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్, క్షేత్రస్థాయి ప్రచారం చేస్తోంది. పాఠశాలలు, కళాశాలల్లో క్విజ్ పోటీలు, ఉపన్యాస పోటీలతో పాటు ఫ్లాష్ మాబ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రజల్లో ఉత్సాహాన్ని నింపేందుకు 3౨, 5౨ రన్ నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పిస్తున్నారు. బహిరంగ సభకు మోదీ, చంద్రబాబు, పవన్ వచ్చే ఓపెన్ టాప్ రథాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. 13 వేల 500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులతో థింసా నృత్య ప్రదర్శన ద్వారా ప్రధానికి స్వాగతం పలకనున్నారు. తద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సృష్టించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# చంద్రబాబువి అన్నీ దుర్మార్గపు ఆలోచనలే

-మొదటిపేజీ తరువాయి
మాట్లాడుతూ.. 'ఈ రోజు రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు జరుగుతున్నాయనే దానికి ఇదే నిదర్శనం. కనీసం మానవతా విలువలు లేకుండా మంచితనానికి పాతరేశారు. నీట్ రాసి.. తన తండ్రిలాగా డాక్టర్ అవ్వాలని అనుకున్నాడు సీదిరి కుమారుడు. తెలిసో తెలియకుండా యాక్సిడెంట్ చేశాడు. కానీ కేసును ట్విస్ట్ చేసి హత్య చేశాడని, కుట్ర చేసి సీదిరి కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు.
అనుకోని పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదం జరిగితే.. ఆ పిల్లాడి జీవితాన్ని నాశనం చేయాలని చూడటం ఎంతవరకు సరైంది. బీసీల్లో సీదిరి మంచి నాయకుడు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కాబట్టి. చిన్న పిల్లాడు చేసిన యాక్సిడెంట్‌ను కుట్రగాను. హత్యగాను చిత్రీకరించి సీదిరి కుటుంబాన్ని ఇరికించే కార్యక్రమం ఎంతవరకు ధర్మం. అతిసామాన్యమైన కుటుంబం నుంచి వచ్చి వైద్యుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అప్పల రాజును ఇబ్బంది పెట్టేలా తన కెరీర్‌ను నాశనం చేయాలని దుర్మార్గకపు ఆలోచన చేస్తున్నారు.
18 ఏళ్ల విద్యార్థి జీవితాన్ని నాశనం చేస్తున్న చంద్రబాబు గడ్డి తింటున్నారా?. మనిషా? రాక్షసుడా?. ఇదే టీడీపీ నేతలు ఎవరైనా చేస్తే ఇలాగే శిక్షలు విధిస్తారా?. ఇదే శ్రీకాకుళం ఎమ్మెల్యే, పాతపట్నం ఎమ్మెల్యే యాక్సిడెంట్ చేస్తే.. ఈ కేసుల్లో ఎవరిని అరెస్టు చేశారు. ఒక్కొక్కరికి ఒక్కోలా చేస్తే వ్యవస్థ బతకదు. చంద్రబాబు విష విత్తనాలు నాటుతున్నారు. అదే వ్యవస్థను నాశనం చేస్తున్నారు.
హత్య చేసేందుకు ప్రయత్నం చేస్తే.. ప్రమాదంలో గాయపడ్డ బాధితుడ్ని రక్షించేందుకు సీదిరి కుమారుడు ప్రయత్నించాడు. 108కి ఫోన్ చేశాడు. సీపీఆర్ చేశాడు. సీదిరి సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు యాదవ మంత్రిని పంపించి ర్యాలీలు చేస్తారా?. అదే చంద్రబాబుకు బాధిత కుటుంబానికి మంచి చేయాలన్న



మనసుంటే ఇరు కుటుంబాల మధ్య సయోధ్య చేకూర్చి బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చేసే ప్రయత్నం చేయాలి.
పేదలంటే ప్రేమలేదు. బీసీలను ఓటు బ్యాంకు కోసం వాడుకుంటాడు. చంద్రబాబుకు బీసీలు కాదు యాదవులంటేనే ప్రేమలేదు. ప్రకాశం జిల్లాలో యాదవ కుటుంబం దాడి చేసి తిరిగి ఆ కుటుంబంపైనే కేసు పెట్టించిన ఘనుడు చంద్రబాబు. చరిత్రలో తొలిసారి యాదవ మహిళను వైఎస్సార్‌సీపీ విశాఖ మేయర్‌ని చేసింది. ఆ తర్వాత చంద్రబాబు కుట్రతో ఆమెకు పదవిని దూరం చేశాడు. విశాఖలో యాదవ భవన్‌ను పూర్తి కాకుండా అక్కడో కుట్ర. మత్స్యకారులు ప్రమాదానికి గురైతే కనీసం వాళ్ల కుటుంబ సభ్యుల్ని పరామర్శించలేదు. వైఎస్ జగన్ వెళ్లాడు. బాధితుల్ని పరామర్శించాడు.
ఫిషింగ్ హార్బర్‌లను అమ్ముకుంటుంటున్నాడు. మత్స్యకారుల జీవితాల్ని నాశనం చేస్తున్నాడు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ లేదు. అమ్మఒడి లేదు. నోరు తెరిస్తే అబద్ధాలు, చేస్తే మోసాలు. ప్రశ్నిస్తే వాళ్లమీద తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు, జీవితాలు నాశనం అవుతాయన్న జ్ఞానం లేదు. సీదిరి అప్పల రాజు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తోంది. అప్పల రాజు విషయంలో న్యాయం గెలుస్తోంది. త్వరలో ఆయన జైలు నుంచి బయటకు వస్తారు' అని వైఎస్ జగన్ ఆకాంక్షించారు.

# మండలి రేసులో ఆ నలుగురు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లోఖాళీగా ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై అధికార కూటమి ప్రభుత్వం కసరత్తును అత్యంత ముమ్మరం చేసింది. రాష్ట్ర శాసనమండలిలో ఖాళీ అవుతున్న ఈ నామినేటెడ్ స్థానాలను భర్తీ చేసేందుకు వీలుగా ప్రభుత్వ పెద్దలు ఇప్పటికే అర్హులైన అభ్యర్థుల పేర్లపై సుదీర్ఘంగా చర్చలు జరుపుతున్నారు. సుదీర్ఘ కాలంగా పార్టీకి నమ్మకంగా సేవలు అందిస్తూ, గత ఎన్నికల్లో రాజకీయ సమీకరణాల వల్ల అవకాశాలు కోల్పోయిన సీనియర్ నాయకులతో కూడిన తుది జాబితాను సిద్ధం చేసే పనిలో టీడీపీ అధిష్టానం నిమగ్నమైంది.ప్రస్తుతం ఈ ఎమ్మెల్సీ రేసులో తెలుగుదేశం పార్టీ కి చెందిన పలువురు హేమాహేమీల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అందులో ముఖ్యంగా టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి వర్ల రామయ్య, రాయలసీమకు చెందిన సీనియర్ నేత, కడప జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి, కొమ్మాలపాటి శ్రీధర్, మరియు కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి పేర్లు ప్రధానంగా ప్రచారంలో ఉన్నాయి. గతంలో రాజ్యసభ స్థానాలను ఆశించి భంగపడిన వర్ల రామయ్య వంటి నేతలకు ఈసారి ఖచ్చితంగా అవకాశం కల్పించి శాసనమండలికి పంపాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం.వీరితో పాటు మాజీ ఎమ్మెల్యేలు వంగవీటి రాధాకృష్ణ, దేవినేని ఉమామహేశ్వరరావు పిఠాపురం వర్మ కూడా రేసులో నిలిచారు. శాసనమండలిలో డిప్యూటీ ఛైర్మన్ మేయానా జాకియా ఖానం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుల పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఈ ఖాళీలను భర్తీ చేయడం ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంగా మారింది. ఒకవైపు సామాజిక సమీకరణాల లెక్కలు చూస్తూనే, మరోవైపు ప్రాంతీయ సమతుల్యత దెబ్బతినకుండా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తున్నారు.ముఖ్యంగా దళిత, బీసీ మరియు మైనారిటీ సామాజిక వర్గాలకు ఈ పదవుల్లో సముచిత స్థానం కల్పించే దిశగా కసరత్తు సాగుతోంది. గవర్నర్ కోటా కింద భర్తీ చేసే ఈ అత్యున్నత స్థానాలకు సంబంధించిన అధికారిక ప్రకటన నేడు రాజ్‌భవన్ నుండి వెలువడే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం అందుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం సిఫారసు చేసిన అభ్యర్థుల జాబితాకు గవర్నర్ ఆమోద ముద్ర వేసిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఎవరికి ఏ పదవి దక్కుతుందనే దానిపై అమరావతి రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ క్లైమాక్స్‌కు చేరింది.



**వంగవీటి రాధకు క్లియర్**
విజయవాడ రాజకీయం ఎప్పుడూ రసవత్తరంగానే ఉంటుంది. ముఖ్యంగా వంగవీటి కుటుంబానికి ఇక్కడ ఉన్న క్రేజ్, ఫాలోయింగ్ ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గడిచిన ఎన్నికల్లో వంగవీటి రాధాకృష్ణను ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దింపాలని తెలుగుదేశం పార్టీ అధిష్టానం శతవిధాలా ప్రయత్నించింది. మచిలీపట్నం ఎంపీ సీటుతో పాటు ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు పలు ఆకర్షణీయమైన ఆప్షన్లను ఇచ్చింది. అయినప్పటికీ, రాధా మాత్రం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి మాత్రమే పోటీ చేయడానికి ఆసక్తి చూపించారు. అయితే, అక్కడ అప్పటికే నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యేగా ఉండి.. స్వల్ప తేడాతో ఓడిపోయిన బొండా ఉమామహేశ్వరరావు ఉండటంతో.. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా బొండాను కాదనలేక, రాధా సైలెంట్ అయ్యి పోటీకి దూరంగా ఉండిపోయారు.తెలుగుదేశం పార్టీకి, వంగవీటి రాధాకు కాగల కార్యాన్ని ఇప్పుడు బొండా ఉమనే స్వయంగా నెరవేరుస్తున్నారు ఇటీవల గుంటూరు సభ వివాదం, వైఎస్ఆర్‌సీపీ నేతలతో ఒకే వేదికను పంచుకోవడం, నియోజకవర్గంలో తలెత్తిన కొన్ని అంతర్గత వివాదాల కారణంగా బొండా ఉమ గ్రాఫ్ క్రమంగా తగ్గుతోందనే టాక్ వినిపిస్తోంది. అధిష్టానం దృష్టిలో ఆయనపై నమ్మకం సడలడం, వివాదాస్పద అంశాల్లో ఇరుక్కోవడంతో బొండా స్థానం ఇరకాటంలో పడింది. ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి.. విజయవాడ సెంట్రల్ పరిధిలో వంగవీటి కుటుంబానికి ఉన్న మాస్ ఇమేజ్, వర్గీకరణలకు అతీతంగా ఉన్న అభిమానం ముందర, రాధా ప్రత్యక్ష బరిలో నిలబడితే ప్రత్యర్థి ఎవరైనా సరే గెలుపు సాధించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యమే.ఇన్నాళ్లూ సెంట్రల్ నియోజకవర్గం సీటు విషయంలో బొండా ఉమ అడ్డుగోడగా ఉన్నారని భావించిన వారికి, ఇప్పుడు ఆయన స్వయంకృతాపరాధాలు, మారిన రాజకీయ సమీకరణలు సరికొత్త అవకాశాన్ని ఇస్తున్నట్లు కనిపిస్తోంది. అధిష్టానం కూడా సెంట్రల్‌లో ప్రత్యామ్నాయ నాయకత్వం వైపు లేదా క్లీన్ ఇమేజ్ ఉన్న బలమైన నేత వైపు మొగ్గు చూపే పరిస్థితిని బొండా ఉమనే స్వయంగా కల్పించినట్లయింది. పార్టీ కోసం, నియోజకవర్గంలో మళ్లీ తిరుగులేని ఆధిపత్యం కోసం రాధా లాంటి మాస్ లీడర్‌ను రంగంలోకి దింపితే తిరుగుండదనే భావన టీడీపీ క్యాడర్‌లోనూ వ్యక్తమవుతోంది. రాధా పోటీ చేసేందుకు ఉన్న ఏకైక అడ్డంకి తొలగిపోయినట్లేనని, వచ్చే ఎన్నికలు లేదా పొలిటికల్ రీ-ఆర్గనైజేషన్ నాటికి విజయవాడ సెంట్రల్ నుంచి వంగవీటి రాధాకృష్ణ పోటీకి మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు

## గ్లోబల్ ఇన్వెస్టర్లంతా ఏపీ వైపు చూస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి
ఇందులో కర్నూలు జిల్లాలో 400 మెగావాట్ల సోలార్ పవర్, అనంతపురం జిల్లాలో 400 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు ఉంది. ఈ మేరకు టాటా, సుజలం సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రాజెక్టులకు భూమి పూజ చేశారు. రూ.5750 కోట్ల పెట్టుబడితో, పత్తికొండలో 400 మెగావాట్ల సౌర విద్యుత్‌ను, అనంతపురం జిల్లా కనేకల్లులో 400 మెగావాట్ల పవన విద్యుత్‌తో కలిపి, 800 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుగా అవతరించబోతోందని లోకేశ్ పేర్కొన్నారు. తద్వారా 4000ల ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. 3400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గల ఈ ప్రాజెక్టుల ద్వారా 1100 పైగా రైతు కుటుంబాలకు దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన కౌలు ఆదాయం అందుతుందని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌లు ఏపీపైనా, తమ పరిపాలనపైనా విశ్వాసానికి ప్రతీకని లోకేశ్ వివరించారు. "టాటా గ్రూప్‌తో మాకు దశాబ్దాల అనుబంధం ఉంది. భారతదేశంలోనే అత్యంత పొడవైన తీరప్రాంతం, సమృద్ధిగా పునరుత్పాదక వనరులు, ప్రపంచస్థాయి ఓడరేవులు ఉన్న ఏపీ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఎగుమతులకు భారతదేశపు ముఖద్వారంగా మారడానికి మాకు అవకాశం కల్పిస్తున్నాయి. అతి త్వరలో ఆంధ్రప్రదేశ్?లో ఉత్పత్తయ్యే స్వచ్ఛమైన ఇంధనాన్ని తీసుకెళ్లే ఓడలు యూరప్, జపాన్, కొరియా, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తాయి. క్లీన్ మాలిక్యులస్, గ్రీన్ ఫ్యూయల్స్, సాంకేతికతలను ఎగుమతులూ రాష్ట్రం నుంచి చేసే స్థాయికి చేరతాం."
'గతేడాదితో పోలిస్తే ఈ ఒక్క సంవత్సరంలోనే ఏపీలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400 శాతం పెరిగింది. ఇది రాష్ట్ర విశ్వసనీయతను పునరుద్ధరించడం వల్లే సాధ్యమైంది. ఆంధ్రప్రదేశ్?లో 2024 జూన్?లో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. అంతకుముందు ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచంలోని అనేక అతిపెద్ద ఇన్ఫ్రా, క్లైమెట్ ఫండ్స్ ఏపీని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం. 15,000ల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని' లోకేశ్ వివరించారు.
"ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్?మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్ ప్రపంచస్థాయి తయారీ వరకు మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్?ను ఏపీలో నిర్మించాలని అనుకున్నాం. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించు కోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్?గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం." రాష్ట్ర ప్రభుత్వం, ఐఐటీ తిరుపతి, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఆస్ట్రేలియా) సహకారంతో సోలార్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ టెక్నాలజీల కోసం ఏర్పాటు చేస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పని చేయాలని టాటా పవర్‌ను ఆహ్వానిస్తున్నామని లోకేశ్ తెలిపారు. మనం కలిస్తే భారతదేశపు స్వచ్ఛ ఇంధన భవిష్యత్?ను నిర్మించే ఇంజనీర్లు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలను తయారు చేయగలమన్నారు. టాటా రెన్యూవబుల్ ఎనర్జీ కార్యరూపం దాల్చడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కర్నూలు జిల్లా పత్తికొండకు లోకేశ్ రావడంతో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా పార్టీ జెండాలు పట్టుకొని ఆయనతో కరచాలనం చేయడానికి పోటీ పడ్డారు. అక్కడ వేరుశనగ కాయలు అమ్ముకునే మహిళతో కాసేపు ముచ్చటించిన లోకేశ్? ఆమె అమ్ముతున్న విధానాన్ని చూసి ముచ్చట పడి వేరుశనగ కాయలను కొనుగోలు చేసి డబ్బులు కూడా అందజేశారు.

## దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

-మొదటిపేజీ తరువాయి
అధికారులతో గురువారం వర్చువల్‌గా నిర్వహించిన సమీక్షలో విమానాశ్రయ ప్రారంభోత్సవ సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని క్షేత్రస్థాయిలో నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పథకాల పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు. ఆర్డీఎస్ఎస్ పనుల వల్ల డిస్కంపై రూ.100 కోట్లకు పైగా ఆర్థిక భారం తగ్గిందని తెలిపారు. విద్యుత్ నష్టాల నివారణకు భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల్లో కొనసాగుతున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు.

**గోదావరి పుష్కరాల విద్యుత్ శాఖ సమాయత్తం**
రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా విద్యుత్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. మార్చి 2027 నాటికి పుష్కరాలకు సంబంధించిన అన్ని విద్యుత్ మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలని సూచించారు. పుష్కరాల నాటికి కొత్తగా 19 సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరును వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించగా, జూన్ నాటికి అర్హులైన దరఖాస్తుదారులకు కనెక్షన్లు మంజూరు చేసినట్లు అధికారులు వివరించారు. గత ఏడాదిలో సుమారు 12 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వెల్లడించారు.

**దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు**
విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసే దళారులను నమ్మి మోసపోవద్దని మంత్రి ప్రజలను హెచ్చరించారు. ఉద్యోగ నియామకాలు పూర్తిగా మెరిట్ ప్రాతిపదికనే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఇప్పటివరకు విద్యుత్ శాఖ పరిధిలో 450 కారుణ్య నియామకాలు చేపట్టినట్లు గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

## వైసీపీ సీనియర్లలో అసంతృప్తులు

**నెల్లూరు :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎటు వెళ్తుందో తెలియడం లేదు. ఆ పార్టీ సీనియర్లలో ఆందోళన అదే. ప్రజా పోరాటాలు చేయడం లేదు. ప్రజా ఆందోళనలు నిర్వహించడం లేదు.. జాతీయస్థాయిలో జరుగుతున్న పెద్ద ఉద్యమాలకు మద్దతు తెలపడం లేదు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చుట్టూ వివాదాలు, కేసులు నడుస్తున్నాయి. అలాగని గత ప్రభుత్వ హయాంలో జరిగిన కేసులు కావు. ఇందులో నేరుగా కూటమి ప్రభుత్వం కలుగజేసుకోవడం లేదు. కానీ ఒక్క వైసీపీ నేతపై కేసు నమోదు అవుతుంది. అరెస్టుల పర్వం నడుస్తోంది. దీనిపైనే వైసీపీలో సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. వ్యక్తిగత వ్యవహార శైలితో పార్టీని కొంతమంది నేతలు డ్యామేజ్ చేస్తున్నారన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. ఇది పార్టీ పై ప్రతికూలత చూపుతోందన్న ఆవేదన సీనియర్లలో ఉంది. ఇన్ని రోజులు అధినేత జగన్మోహన్ రెడ్డి ఏం చేసినా ఊరుకున్నామని.. ఇకనుంచి ఊరుకోబోమని వారు చెబుతున్నారు. హెచ్చరించినంత పని చేస్తున్నారు.కొద్ది రోజుల కిందట సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పార్టీలోనే పవర్ఫుల్ నేత ఆయన. మరి ఎందుకు ఆ స్థాయిలో మాట్లాడడం లేదు అని రిపోర్టర్ ప్రశ్నించేసరికి పెద్దిరెడ్డి వింత సమాధానం చెప్పారు. తమ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆవేదనతో సంకేతాలు ఇచ్చారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని.. తాను అటువంటిదే కోరుకుంటానని.. తమ పార్టీ నేత అంబటి రాంబాబు లా మాట్లాడను అంటూ చురకలు అంటించారు. అయితే అది అంబటి రాంబాబు నువ్వు ఉద్దేశించింది కాదు. తెర వెనుక జగన్ వైఖరిని తప్పు పట్టడమే దాని ముఖ్య ఉద్దేశం. ఒక్క పెద్దిరెడ్డి మాత్రమే కాదు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు లాంటి సీనియర్ నేతలు వైసీపీలో అనవసర వ్యాఖ్యలు చేసే నాయకుల వైఖరిని తప్పుపడుతున్నట్లు తెలుస్తోంది.మొన్నటి వరకు కూటమి ప్రభుత్వం పాత కేసులను తెరపైకి తెచ్చి వెంటాడింది అని వైసిపి ఆరోపించింది. కానీ ఇప్పుడు ఒక్కో నేత అరెస్టు తీరు చూస్తే మాత్రం భిన్నంగా ఉంది. కేసులు నమోదు కావడం వెనుక చూస్తుంటే వ్యక్తిగత వ్యవహార శైలి కనిపిస్తోంది. మాజీ మంత్రి అప్పలరాజు వ్యవహరించిన తీరుతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. తన కుమారుడు బైక్ రైటింగ్ కారణంగా ఓ మనిషి ప్రమాదానికి గురయ్యారు. కానీ అది తన కొడుకు మెడకు చుట్టుకోకుండా మరో వ్యక్తిని బలిపశువు చేయడానికి చూశారు. దానిని కూడా సక్రమంగా హ్యాండిల్ చేయలేకపోయారు. చివరకు ఆయన అరెస్టు కూడా జరిగిపోయింది. పార్టీకి డ్యామేజ్ మిగిల్చింది. తమ్మినేని సీతారాం గురించి అయితే చెప్పనవసరం లేదు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి!

## గౌరీదేవిపేట పి.హెచ్.సి వైద్యాధికారిణి డాక్టర్ శ్రీదేవి కీలక సూచనలు

## పరిశుభ్రత, దోమల నివారణతోనే జ్వరాలకు చెక్.. జ్వరం వస్తే నిర్లక్ష్యం వద్దు!

**ఎటపాక, జూలై 30 (ప్రజాజ్యోతి):** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గౌరీదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ శ్రీదేవి సూచించారు. ఈ సందర్భంగా డా. శ్రీదేవి మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు చేశారు.

**పరిశుభ్రతే వ్యాధుల నివారణకు ప్రధాన మార్గం**

వర్షాకాలంలో అపరిశుభ్రత, కలుషిత నీరు, నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆమె తెలిపారు. ముఖ్యంగా దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, అలాగే టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

**ప్రజలకు ముఖ్య సూచనలు**

ఇంటి పరిసరాల్లో ఖాళీ సీసాలు, పాత టైర్లు, వాడి పడేసిన పాత్రలు, కొబ్బరి బొండాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. తాగునీటిని తప్పనిసరిగా బాగా కాచి, చల్లార్చిన తర్వాతే వినియోగించాలని సూచించారు. ఎప్పటికప్పుడు తాజాగా వండిన వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, రోడ్ల పక్కన విక్రయించే కలుషిత ఆహారాన్ని నివారించాలని కోరారు.



రోగని పరీక్షిస్తు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీదేవి

**దోమల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు**

రాత్రి వేళల్లో తప్పనిసరిగా దోమతెరలను ఉపయోగించాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. శరీర నిరోధక శక్తి పెరిగేలా పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

**జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దు**

ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. జ్వరం, ఒంటినొప్పులు లేదా ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య సేవలు పొందాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



సీజనల్ వ్యాధులపై సూచనలు చేస్తున్న డాక్టర్ శ్రీదేవి

# తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు... ఏ విచారణకైనా నేను సిద్ధం..!

-- మాజీ సర్పంచ్ నాగమణి సవాల్



**కూనవరం జులై 30 ప్రజా జ్యోతి** "మీ బెదిరింపులకు, తాటాకు చప్పుళ్లకు ఇక్కడ భయపడేవారు ఎవరూ లేరు. నిజంగా నీకు, నీ అయ్యకు దమ్ముంటే ఏ విచారణ అయినా చేయించుకోండి... దేనికైనా నేను సిద్ధం!" అని మాజీ సర్పంచ్ నాగమణి, బీజేపీ నాయకుడు పాయం సుందరయ్య వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**ఆరోపణలు చేసే ముందు తమ సొంత చరిత్ర ఏమిటో తెలుసుకుంటే మంచిదని హెచ్చరిస్తూ ఆమె ప్రకటన విడుదల చేశారు:**

**రాజకీయ బ్లాక్ మెయిలింగ్ మాకు రాదు:**

"నీ అయ్యలాగా ప్రజలను, అధికారులను బ్లాక్ మెయిల్ చేసి బ్రతకడం మా రక్తంలోనే లేదు. ఆదివాసీల ఆస్తులను, భూములను అక్రమంగా ఆక్రమించడం మాకు చేతకాదు. నీతిగా, నిజాయితీగా గ్రామాభివృద్ధి కోసం పనిచేశాం కాబట్టే ప్రజల్లో గౌరవంగా నిలబడ్డాం."

**విచారణ నా మీద కాదు... మీ అయ్య చిట్టా విప్పుతాం:**

"మా పాలనపై విచారణ కాదు... ముందు మీ అయ్య పాయం వెంకయ్య ఎక్కడెక్కడ ఏ రకంగా బ్లాక్ మెయిల్ చేశాడు? ఎవరెవరి దగ్గర ఎంతెంత వసూళ్లు చేశాడో? ఆదివాసీల భూములను ఎలా సొంతం చేసుకున్నాడో త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతాం. మీ సొంత బిజెపి పార్టీయే మీ అక్రమాలపై విచారణ జరిపే రోజు అతి దగ్గరలోనే ఉంది."

**నిజాలు త్వరలోనే తేలుతాయి:**

"గ్రామంలో ఏ నిధులు ఎక్కడ దుర్వినియోగం అయ్యాయో, ఎవరు అవినీతికి పాలుపడ్డారో ప్రజలందరికీ తెలుసు. త్వరలోనే మీ బిజెపి పార్టీలోనే మీ అవినీతి చిట్టాపై సమగ్ర విచారణ జరుగుతుంది. అప్పుడు తేలుతుంది ఎవరు సుద్దపూసలో, ఎవరు అవినీతి పరులో!" చేతనైతే గ్రామాభివృద్ధికి తోడ్పడాలే తప్ప, స్వార్థ రాజకీయాల కోసం తప్పుడు ప్రకటనలు ఇస్తే ఊరుకునేది లేదని నాగమణి హెచ్చరించారు.

# ఉద్యోగాల సృష్టి టిడిపికే సాధ్యం

**డి ఎస్ సి గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదు.....**

**ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ పాలక మండలి సభ్యులు గుమ్మరాల సుధాకర్**



**హోళగుంద, జూలై 30, ప్రజా జ్యోతి న్యూస్** 2024 సార్వత్రిక ఎన్నికల్లో డి ఎస్ సి ద్వారా ఉపాధ్యాయుల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన ప్రకారం 15 నెలలోనే డి ఎస్ సి ద్వారా దాదాపు 16 వేల పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించడం జరిగిందని, దేశంలో నిరుద్యోగులకు ఉద్యోగం సృష్టించాలంటే అది కేవలం విజనరీ నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మాత్రం సాధ్యమని ,ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ పాలక మండలి సభ్యులు గుమ్మరాల సుధాకర్ అన్నారు. అంతేకాక కానిస్టేబుల్ 6000 ఉద్యోగాలు కల్పించారన్నారు.ఆంధ్ర రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థి పట్ల ఉపాధ్యాయుల పట్ల ఎంతో క్రమశిక్షణంగా నడుచుకుంటున్నారనీ ఇది చూసి ఓర్చుకోలేక ప్రతిపక్ష హోదా లేని గొడ్డలి పార్టీ నాయకులు బురద చెల్లుతున్నారని మండిపడ్డారు.నిరుద్యోగుల పట్ల విశ్వాసం లేని నాయకులు ఈరోజు బయటికి వచ్చి ఉద్యోగం తీసుకున్న ఉపాధ్యాయుల కడుపు కొడుతున్నార న్నారు., డి ఎస్ సి లో అన్యాయం జరిగిందని కోర్టుకు వెళ్ళినారు కానీ న్యాయస్థానం దీన్ని కొట్టేసిందన్నారు. 2019 నుంచి 2024 వరకు ఒక్క డి ఎస్ సి ఉద్యోగం కూడా ఇవ్వకుండా నిరుద్యోగులకు మోసం చేసిన దుర్మార్గ పాలన వై సి పి పార్టీది కాదా అని ప్రశ్నించారు.యువతకు ఉద్యోగాలు సృష్టించడంలో దేశంలోనే మొదటి స్థానంలో నారా లోకేష్ నిలిచారని ఇది చూసి గొడ్డలి పార్టీ నాయకులు తమ పార్టీ వైపు ప్రజలు చూడరని తెలుసుకొని తప్పుడు ప్రచారానికి నాంది పలుకుతున్నారు, ప్రజలు గొడ్డలి పార్టీ నాయకులను నమ్మే పరిస్థితిలో లేరు అని విమర్శించారు.

# రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు ఆగస్టు 1 నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు

**గుంతకల్లు జూలై 30 (ప్రజా జ్యోతి)::**నారాయణ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి శనివారం, గుంతకల్లు పట్టణంలోని ధర్మవరం గేట్ సమీపంలో ఉన్న రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక ఆరోగ్య పరీక్షల కార్యక్రమం నిర్వహించబడు తోంది. అందులో భాగంగానే ఆగస్టు 1వ తేదీ శనివారం నాడు నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులు కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిం చడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండు కోవాలని నారాయణ చారిటబుల్ ట్రస్ట్ వారు తెలిపారు. ఈ ఆరోగ్య పరీక్షలు ఉదయం 6:30 గంటల నుండి సాయంకాలం ఐదు వరకు నిర్వహించబడు తుంది.అందుబాటులోనున్న సేవలు మాస్టర్ హెల్త్ చెకప్ ఎఫ్ బి ఎస్ (తినకముందు) మరియు పి పి బిఎస్ (తిన్న తర్వాత) షుగర్ పరీక్షలు, రక్తపోటు (బిపి) పరీక్ష, ఇతర అన్ని రకాల రక్త పరీక్షలు అతి తక్కువ ధరల్లో, ఆరోగ్యమే నిజమైన సంపద. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించడానికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్. నారాయణ నాయక్, అధ్యక్షులు, నారాయణ తెలిపారు.




చారిటబుల్ ట్రస్ట్ వారిని సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 9866141779, 08552-223579.

# ముద్రగడకు నివాళులర్పించిన బోడె రామచంద్రయాదవ్





**శంఖవరం: కిర్లంపూడి జులై 30, (ప్రజాజ్యోతి న్యూస్)** ప్రముఖ కాపు ఉద్యమ నేత, పోరాట యోధుడు స్వర్గీయ ముద్రగడ పద్మనాభం గారికి భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ గురువారం ఆయన స్వగ్రామంలో ఘనంగా నివాళు లర్పించారు. ముద్రగడ చిత్రపటానికి పూలమాల లు వేసి అంజలి ఘటించారు. తాను అమ్మవారి దీక్షలో ఉన్నందున ఆయన మృతి సమయంలో రాలేకపోయానని, అందుకే ఇప్పుడు వచ్చి నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు.ఈ సందర్భంగా రామచంద్రయాదవ్ మాట్లాడుతూ ముద్రగడ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జాతి అభివృద్ధి, పేదల అభ్యున్నతి కోసం రాజీలేని పోరాటం చేసిన గొప్ప యోధుడని కొనియాడారు. పదవులతో సంబంధం లేకుండా సిద్ధాంతం కోసం నిలబడిన గొప్ప మనస్తత్వం ఆయనదని ప్రశంసించారు. ముద్రగడ పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిపేలా త్వరలో విజయవాడలో బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు.సుమారు నాలుగేళ్ల క్రితం ముద్రగడతో గడిపిన అనుభవాలను గుర్తుచేసుకుని రామచంద్రయాదవ్ భావోద్వేగానికి గురయ్యారు. "ఆయన స్వయంగా నాకు అల్పాహారం వడ్డించి ఆత్మీయత చూపారు. పితృసమానుడిగా సలహాలు ఇచ్చారు" అని అన్నారు. ముద్రగడ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీవై జిల్లా అధ్యక్షులు రాయుడు నాగేశ్వరావు, పిఠాపురం ఇన్చార్జ్ సిరం శీను, రాష్ట్ర పీఏసీ సభ్యులు అత్తిలి రాజు, యూత్ కన్వీనర్ పీతల రాజా, శివ, బీసీవై పార్టీ కన్వీనర్ గంప శివకుమార్, కోన గంగాధర్, సానబోయిన అదిబాబు, కొండల శ్రీను,ముద్రగడ అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నరు,

# శంఖవరంలో ఘనంగా పరదేశమ్మ అమ్మవారి అన్నప్రసాద వితరణ మహోత్సవం





**శంఖవరం: జులై 30, (ప్రజా జ్యోతి న్యూస్)** మండల కేంద్రమైన శంఖవరం గ్రామంలో కొలువై ఉన్న గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ పరదేశమ్మ అమ్మవారి సన్నిధిలో అన్న ప్రసాద వితరణ మహోత్సవం గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది.ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు,పర్వత సురేష్ హాజరయ్యారు. ముందుగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని వితరణ చేశారు.ఈ సందర్భంగా పర్వత సురేష్ మాట్లాడుతూ "శంఖవరం గ్రామ దేవత అయిన పరదేశమ్మ తల్లి సన్నిధిలో ఇలాంటి పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. అన్నదానం కంటే మించిన దానం లేదు. అమ్మవారి ఆశీస్సులతో మన గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులకు నా అభినందనలు. ఆలయ అభివృద్ధికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పరదేశమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 11వ రోజు దీక్ష చేపట్టిన డాక్యుమెంట్ రైటర్లకు మద్దతు తెలిపిన బి ఎస్ పి నాయకులు




**గుంతకల్లు జులై 30 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం 11వ రోజు డాక్యుమెంట్ రైటర్స్ చేప ట్టిన నిరసన దీక్షకు బహుజన సమాజ్ పార్టీ గుంతకల్లు పట్టణ కమిటీ సంఘీభావం తెలిపింది.ఆ పార్టీ జిల్లా ఇంచార్జ్ మరియు గుంతకల్లు నియోజకవర్గం ఇంచార్జ్ బైనేని శ్రీనివాసరాజు మాట్లాడుతూ "రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 396 తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 396 అమలులోకి వస్తే వేలాదిమంది డాక్యుమెంట్ రైటర్ల జీవనోపాధి ప్రమాదం లో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటుతో తమ వృత్తి పూర్తిగా దెబ్బ తింటుందని ఎన్నో సంవ త్సరాలుగా ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతుం దని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జీవో 396 ను రద్దుచేసి రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు నిర్ణయా న్ని ఉపసంహరించుకోవా లని, డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి భద్రత కల్పించా లని వారు డిమాండ్ చేశారు. స్టాంప్ వెండర్ లకు న్యాయం జరిగే వరకూ తాము వారితో కలిసి పోరాడుతామని ఇప్పటి కైనా ప్రభుత్వం దిగివచ్చి వారి సమస్యలు పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఎస్ పి నియోజకవర్గ కన్వీనర్ సయ్యద్ షాహుల్ హమీద్, ఉపాధ్యక్షురాలు ఎం. జామిని, పట్టణ అధ్యక్షుడు బోయ రాధాకృష్ణ, పట్టణ కమిటీ ఇన్చార్జ్ లు యం. జె.విల్సన్ బాబు,పోలా అల్లా బకాష్, పట్టణ ఉపాధ్యక్షురాలు సాజిదా, ప్రధాన కార్యదర్శి రాజేష్, కార్యదర్శి బైనేని దేవయ్య, కోశాధికారి వై. ఎర్రి స్వామి, గుత్తి మండల అధ్యక్షుడు బండల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధారాలు లేని అబద్ధాల ఆరోపణలు చేస్తే ఖబర్దార్ జాగ్రత్త.

## ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు మడకం రమేష్

**కూనవరం జులై 30 ప్రజా జ్యోతి కూనవరం:** కొంతమంది వ్యక్తులు తాము ఇచ్చిన స్టేట్మెంట్కు సంబంధం లేకుండా గతంలో జరిగిన విషయాలను ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారని ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు మడకం రమేష్ విమర్శించారు.స్థానిక ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ ఉన్నతాధికారులను కలిసి పంచాయతీ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తే కొంతమందికి ఎందుకు నొప్పి అని ఆయన ప్రశ్నించారు. పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించిన తర్వాత ప్రోటోకాల్ పాటించకుండా పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలపై ప్రశ్నిస్తే దానిని తప్పుపట్టడం ఎందుకని అన్నారు.గత ఏడు సంవత్సరాల క్రితం జరిగిన అవినీతి గురించి మిమ్మల్ని ఎవరు ప్రశ్నించారని, ఎవరూ అడగకపోయినా మీకు మీరే ఆ విషయాన్ని తెరపైకి తీసుకువచ్చి, అప్పట్లో పాయం మధు సర్పంచ్గా ఉన్న సమయంలో ఎలాంటి అవినీతి జరగలేదని చెప్పడం ఎందుకని రమేష్ ప్రశ్నించారు.డీఎల్పీఓ అధికారి పేరును ప్రస్తావిస్తూ అవినీతి జరగలేదని మీకు మీరే క్లియరెన్స్ ఇచ్చుకుంటే పెద్దార్కూరు గ్రామ పంచాయతీ ప్రజలు దాన్ని నమ్ముతారా? అని ఆయన అన్నారు. అవినీతి జరగలేదని చెబు తున్న వారు అప్పుడే దానికి సంబం ధించిన ఆధారాలతో ఎందుకు నిరూ పించలేకపోయారని ప్రశ్నించారు. ఒకవైపు గ్రామ సభల్లో పంచాయతీ నిధుల వినియోగంపై ప్రజలు పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న సమయంలో, ఆ కార్యదర్శిని తమ వెంట తీసుకెళ్లింది ఎవరు? అని రమేష్ ప్రశ్నించారు. "ఆ రోజు జరిగిన ఘటనలను ప్రజలు మర్చిపో యారని అనుకుంటున్నారా?" అని ఆయన నిలదీశారు.అప్పటి వ్యవహా రాలపై ఇప్పుడు వివరణలు ఇవ్వడం కంటే, అవినీతి జరగలేదని చెబుతు న్న వారు అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు ఉంటే బయట పెట్టాలని డిమాండ్ చేశారు.



# నెట్టికంటూడి హుండీ లెక్కింపు



**గుంతకల్లు జులై 30 (ప్రజా జ్యోతి):** కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. 77 రోజులకు గాను ఆలయ హుండీల ద్వారా రూ. 54,42,524/-లు మరియు మిశ్రమ బంగారం 14 గ్రాముల 300 మిల్లి గ్రాములు, వెండి 770 గ్రాములు, విదేశీ కరెన్సీ బ్యాంక్ ఆఫ్ కెనడా 10 డాలర్స్, సెంట్రల్ బ్యాంక్ అరబ్ కంట్రీ 15 దీనమ్స్, యు ఎస్ ఏ 10 డాలర్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఈజిప్ట్ 50 ఫౌండ్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ కువైట్ 10 దిరన్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇరక్ 5 దిరన్స్, మరియు అన్నదానం హుండీ ద్వారా రూ 1,41,629/- లు మరియు భక్తులు సమర్పించియున్నారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ ధికారి, ఉప కమీషనరు మేడేపల్లి విజయరాజు, దేవాదాయ శాఖ ఉరవకొండ డివిజన్ ఇన్స్పెక్టర్ రాణి, అనువంశి క ధర్మకర్తలు కె.సుగుణమ్మ, కె.అనంత చార్యులు, సహాయ కార్య నిర్వహణధికారి ఓ. వెంకటేశ్వరుడు, ప్రధాన అర్చకులు కె రాఘవాచార్యులు, సూపరింటెండెంట్ లు పి.వెంకటేశులు, బి.రామ్మో హన్ రావు, ఇతర ఆలయ సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, మండి బజార్ బ్రాంచ్ వారు, పోలీసులు, గ్రామ ప్రజలు, వీరభద్ర సేవా సమితి బళ్లారి వారు, శ్రీ హనుమాన్ సేవాసమితి గుంతకల్లు వారు, శ్రీ బాలాజీ సేవా సమితి గుంతకల్లు, శ్రీ రామ సేవ సమితి కర్నూలు వారు, కసాపురం పోలీ సులు ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రైతు ఉత్పత్తి సంఘాల బలోపేతానికి చర్యలు వేగవంతం

**- జాయింట్ కలెక్టర్**





**బాపట్ల జూలై 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు ఉత్పత్తి సంఘాలను బలోపేతం చేసి వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించి ఆదాయం పెంచే దిశగా అధికారులు పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రైతుల సంక్షేమంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలున్నందున ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, సంఘాల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో నాబార్డు గుర్తించిన ఎనిమిది రైతు ఉత్పత్తి సంఘాలకు లైసెన్సులు మంజూరు చేశామని, పూచీకత్తుతో రూ.2 కోట్ల వరకు రుణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రైతు ఉత్పత్తి సంఘాల ప్రతినిధులు ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలు, లైసెన్సుల మంజూరుపై పలు వినతులు చేశారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మి, నాబార్డు డీడీఎం రవికుమార్, ఎల్‌డీఎం శివకృష్ణ, ఉద్యానవన శాఖ ఏడీ ఖలీల్, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్, జిల్లా సహకార శాఖ అధికారి యలమందరావు, వ్యవసాయ శాఖ ఏడీ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు ఒక వరం.

ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభం.



**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. జూలై 30.** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఆగస్టు ఒకటవ తేదీన ప్రారంభించనున్న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు ఒక వరం అని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి, పాలకొల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ధి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజన్ లా ఉపయోగపడనున్న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం లో ఉత్తరాంధ్ర సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికి చాటి చెప్పేలా ఏకకాలంలో 13 వేల మంది గిరిజన మహిళలు, విద్యార్థినిలు సాంప్రదాయ నృత్యం దింసా తో ప్రధాని మోదీకి స్వాగతం పలకనున్నారన్నారు. విమానాశ్రయం నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు తొలి విమాన ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారని ఆయన తెలిపారు. విజయనగరం జిల్లా భోగాపురంలో కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాల సహకారంతో జిఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో 2,7003 ఎకరాల విస్తీర్ణంలో 4,272 కోట్ల ఖర్చుతో నిర్మించారని, నిర్మాణ పనులు ప్రారంభమైన 31 నెలలలో పూర్తి చేశారని ఆయన తెలియజేశారు. 2014-19 కాలంలో రాష్ట్రాన్ని పాలించిన వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఈ అంతర్జాతీయ విమానాశ్రయ పనులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. 380 మీటర్ల రన్ వేతో భారీ అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని, తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణాలు సాగేలా, 28 వేల మెట్రిక్ టన్నులు కార్గో సామర్థ్యం తో ఉత్పత్తులు ఎగుమతులు చేసుకునేలా ఈ విమానాశ్రయాన్ని రూపకల్పన చేసినట్లు వివరించారు. విశాఖపట్నం గంగవరం, మూలపేట పోర్టులకు అనుసంధానమై ఉత్తరాంధ్రను జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్ర బిందువుగా చేయబోతుందని అన్నారు. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అభివృద్ధితో పాటు, పర్యాటక రంగం విస్తరణ, పారిశ్రామిక పెట్టుబడులుకు, ఎగుమతులకు, నైపుణ్య అభివృద్ధి పరిశోధనలకు కేంద్ర బిందువుగా మారేలా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉపయోగపడుతుందని కబర్ధి వెల్లడించారు.

# చలో ఢిల్లీ గోడపత్రాలను విడుదల చేసిన సిపిఐ నాయకులు



**గుంతకల్లు జులై 30 (ప్రజా జ్యోతి):** ఎన్నికల ముందు ఎన్డీఏ ప్రభుత్వం దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బదలావ్ జరూర్ హై సెప్టెంబర్ 1న ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధిం చిన చలో ఢిల్లీ గోడపత్రాల ను గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్ మాట్లాడు తూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రతి సంవత్సరం లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులకు బూటక మైన హామీలు ఇచ్చిందని అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, పేద మధ్యతరగతి ప్రజలకు ప్రధానంగా న్యాయమైన విద్యా, వైద్యం ఉచితంగా అందించాలని, ధరలు పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, గంటలకు కనీసం మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని, మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాల ని, దళిత, ఆదివాసుల పైన దాడులను నిలిపివేయాల ని, కార్మికు లను అణిచివేసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని వీటన్నిటి పైన దశలవారీగా ఉద్యమాలు ఆగస్టు 1 తేదీ నుండి 5వ తేదీ వరకు గుంతకల్లు నియోజకవర్గం లో ఉపజాత ద్వారా రైతులు, వ్యవసాయ, కార్మిక, విద్యార్థి, మహిళ ప్రజలను ఐక్యం చేసి ఉద్యమానికి సిద్ధం చేసి ఆగస్టు 17న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నాను నిర్వహించి, ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు సాధించేందుకు సెప్టెంబర్ 1న ఢిల్లీలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, వెంకట్ నాయక్, ఏఐటియుసి మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, నాయకులు చితాంబరి గురు స్వామి, శంకరప్ప, కత్తి శీను, పెద్దయ్య, ఆటో యూని యన్ అధ్యక్ష కార్యదర్శులు అంజి, కిరణ్ ప్రజానాట్య మండలి మండల అధ్యక్షు లు ప్రసాద్, చేనేత కార్మికులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయండి సర్

## ఏజెన్సీ లో జి.ఓ.నంబర్:68 నీ పకడ్బందీగా అమలు చేయండి

## మంత్రి కి వినతి పత్రాన్ని అందించిన ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ బృందం



**కూనవరం జులై 30 ప్రజా జ్యోతి** ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ రంపచోడవరం డివిజన్ ఆధ్వర్యంలో కమిటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డా "సత్య కుమార్ యాదవ్ ని కలిసి ఏజెన్సీ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎదుర్కుంటున్న సమస్యలను వినతి పత్రం రూపంలో అందించడం జరిగింది

1) కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అప్పటి వరకు 100%గ్రాస్ శాలరీ ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులు మరణిస్తే 50లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, హెల్త్ కార్డ్స్ మంజూరి చేయాలని

2) ప్రాథమిక ఆరోగ్య కేంద్రలలో పనిచేస్తున్న సిబ్బందికి 5 నెలల పెండింగ్ వేతనాలు ఇప్పించాలని

3) ఏజెన్సీ ప్రాంతంలో మెడికల్ డిపార్ట్మెంట్ లో జరిగే ప్రమోషన్స్ అన్ని కూడా జి.ఓ.నంబర్:68 అనుగుణంగానే జరగాలని ఈ నెలలో ఏ యన్ యం ప్రమోషన్ లో ఏజెన్సీ ప్రాంతం ఉద్యోగులకు అన్యాయం జరిగింది అని వివరించడం, ప్లెయిన్ ఏరియా(మైదాన ప్రాంతం) నుండి వచ్చిన ఏ యన్ యం లను వెనక్కి పంపించాలని కోరడం

4) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలలలో నాలుగవ స్టాఫ్ నర్సు లను నియమించాలని

4) ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెక్యూరిటీ గార్డ్ లని నియమించాలని

6) కొత్తగా ఏర్పడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూనవరం లో సిబ్బందిని నియమించాలని

ఇంకా కొన్ని రకాల డిమాండ్స్ తో వినతి పత్రం మంత్రిగారికి అందించడం జరిగింది అని మంత్రిగారు సానుకూలంగా స్పందించారని తెలియజేశారు

**ఈ కార్యక్రమంలో ఆదివాసీ** మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు,రంపచోడవరం డివిజన్ అధ్యక్షులు టి శివ సత్యనారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.చిన్న రెడ్డి,యన్.సత్యవతి, అప్పలరాజు ఏ యన్ యం, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు

# స్మార్ట్ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు



**బాపట్ల జూలై 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** పోలీసు సేవలను అత్యాధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా మార్చడమే స్మార్ట్ పోలీసింగ్ లక్ష్యమని బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం పోలీసు అధికారులు, సిబ్బందికి స్మార్ట్ పోలీసింగ్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకొని ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు ప్రతి పోలీసు అధికారి సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. తొలి దశలో స్టేషన్ అధికారులు, రైటర్లు, కంప్యూటర్ సిబ్బందికి శిక్షణ ఇస్తుండగా, త్వరలో మిగిలిన సిబ్బందికీ విస్తరిస్తామని చెప్పారు.శిక్షణలో,సి సి టి ఎన్ ఎస్ , ఎన్ ఎ టి జి ఆర్ ఐ డి, సి ఈ ఐ ఆర్, సీసీ -360 వ్యవస్థల వినియోగం, దొంగిలించబడిన వాహనాలు, తప్పిపోయిన వ్యక్తుల గుర్తింపు, సైబర్ నేరాల బాధితులకు సహాయం, మొబైల్ ఫోన్ల గుర్తింపు, డ్రోన్ల ద్వారా ట్రాఫిక్, శాంతిభద్రతల పర్యవేక్షణ, దేవాలయాల భద్రత, సీసీటీవీ నెట్‌వర్క్ వినియోగంపై ఐటీ కోర్ నిపుణులు అవగాహన కల్పించారు, కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ సి.హెచ్. చంద్రమౌళి, బాపట్ల పట్టణ సీఐ రాంబాబు, చీరాల-1టౌన్ సీఐ సోమశేఖర్, చీరాల-2టౌన్ సీఐ శశికుమార్, ఐటీ కోర్ ఎస్ఐ నాగేశ్వరరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# సోకులేరు విషాదానికి ముగింపు.. గల్లంతైన ఇద్దరి మృతదేహాలు లభ్యం

## రెండు రోజుల గాలింపు తర్వాత తులసిపాక సమీపంలో మృతదేహాల గుర్తింపు

## పోలీసు, ఏఎన్ఎస్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, గ్రామస్తుల సమిష్టి శ్రమ ఫలితం

## వర్షాకాలంలో జలాశయాల వద్ద అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

**చింతూరు, జూలై 30 (ప్రజాజ్యోతి):** చింతూరు మండలం చడలవాడ పంచాయతీ పరిధిలోని సోకులేరు వాగులో ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోయి గల్లంతైన పెండెం బాబి, పెండెం కళ్యాణ్‌ల మృతదేహాలు గురువారం లభ్యమయ్యాయి. చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. గోపాలకృష్ణ పర్యవేక్షణలో, మోతుగూడెం ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, ఏఎన్ఎస్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, స్థానిక గ్రామస్తుల సహకారంతో గత రెండు రోజులుగా విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం మధ్యాహ్నం చడలవాడ పంచాయతీ పరిధిలోని తులసిపాక గ్రామ సమీపంలో, సోకులేరు వ్యూ పాయింట్‌కు సుమారు 100 మీటర్ల దూరంలో నీటిలో ఇద్దరి మృతదేహాలు గుర్తించారు. ఫిర్యాదుదారుడు వాటిని పెండెం బాబి, పెండెం కళ్యాణ్‌లుగా గుర్తించగా, పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు వర్షాకాలంలో వాగులు, నదులు, జలాశయాలు, వరద ప్రవాహాల వద్ద అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# తల్లి తీసుకునే జాగ్రత్తలే బిడ్డకు శ్రీరామరక్ష: డాక్టర్ ఆనందరాజు

### రూ .20వేలతో 20 మందికి బేబీకిట్లు, బెడ్ షీట్లు పంపిణీ
### బిడ్డ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించిన డాక్టర్ ఆనందరాజు
### ప్రముఖ హోమియోపతి డాక్టర్ రామకృష్ణ అనంతరాజు ఆర్థిక సాయంతో ఇట్లు అందుచేత



**ప్రజాజ్యోతి, (పాలకొల్లు), జులై 30:** బిడ్డ ఆరోగ్యానికి తల్లి తీసుకునే జాగ్రత్తలే శ్రీరామరక్ష అని ప్రముఖ హోమియోపతి డాక్టర్ రామకృష్ణ ఆనందరాజు సూచించారు. గురువారం పోడూరు రాజు గారి హోమియోపతి హాస్పటల్ వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు అధ్యక్షులు గుడాల హరిబాబు ఆధ్వర్యంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ కేర్ లో భాగంగా డాక్టర్ కోసూరి రామకృష్ణ ఆనందరాజు ఆర్థిక సహకారంతో 20 మంది చంటి పిల్లలకు బేబీ కిట్ లు, బెడ్ షీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ ఆనందరాజు మాట్లాడుతూ పిల్లల పెరుగుదల సంరక్షణపై తల్లి ఎంతో శ్రద్ధ వహించాలి అన్నారు. బిడ్డ పుట్టిన నాటి నుండి నడక వచ్చేవరకు తల్లి పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తల్లి కౌగిలి ద్వారా బిడ్డ వెచ్చదనంలో ఉండేటట్లు చూడాలని, పడుకుని బిడ్డకు పాలు ఇవ్వరాదని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తదుపరి అదనపు పోషకాహారం అందించాలని వివరించారు. వ్యాధి నిరోధక టీకాలు తగు సమయంలో వేయించాలని డాక్టర్ ఆనందరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు గుడాల హరిబాబు, కార్యదర్శి శిరిగినీడి నాగార్జున, కోశాధికారి ఆరుమిల్లి సురేష్, ఫాస్ట్ ప్రెసిడెంట్ లు డీజీ ఎన్.ముచ్చర్ల సంజయ్, జిల్లా జాయింట్ సెక్రెటరీ ముత్యాల శ్రీనివాస్, మద్దాల రాంప్రసాద్, కావలి నగేష్, ఇమిడి రాజేష్, పోతాబత్తుల సత్యనారాయణ, ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, ఓడూరి సురేష్, వరప్రసాద్, వైద్య సిబ్బంది పి.ఎలిజిబెత్, పి.సీతామహాలక్ష్మి, మీ రాంజనేయులు. స్రవంతి. ఆదిలక్ష్మి. ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# డీఆర్ఓ గంగాధర్ గౌడ్ సేవలు జిల్లా పరిపాలనకు ఆదర్శం





**బాపట్ల జూలై 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతి నిధి)** ఉద్యోగ విరమణ పొందుతున్న జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్ అందించిన సేవలు ప్రభుత్వం, జిల్లా పరిపాలనకు అమూల్యమైనవని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, ఐఏఎస్ పేర్కొన్నారు. గురువారం బాపట్ల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో డీఆర్ఓ గంగాధర్ గౌడ్ దంపతులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంగాధర్ గౌడ్ తన సేవాకాలమంతా నిబద్ధత, నిజాయితీ, సమయపాలనతో విధులు నిర్వహించి సహచర అధికారులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ, పరిపాలనా అనుభవం జిల్లాకు ఎంతో ఉపయోగపడిందన్నారు. భూ పరిపాలన, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సేవలు, విపత్తుల నిర్వహణ వంటి రంగాల్లో విశేష కృషి చేశారని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా పాల్గొని ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. డీఆర్ఓ గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో పనిచేసే అవకాశం లభించడం, ముఖ్యంగా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పనిచేయడం తనకు సంతోషాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పరిపాలన అధికారి ఏ. మల్లిఖార్జునరావు, సెక్షన్ సమన్వయ అధికారి షఫీ తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం గడ్డపై పవనోత్సవం

### :అన్నదాతల కన్నీళ్లు తుడిచిన జననేత.. పాలాభిషేకంతో కృతజ్ఞత చాటిన జనసేన నాయకులు!
### దేవుడు నడిచొచ్చాడు.. పిఠాపురం గుండెల్లో సాగునీటి పండగ తెచ్చాడు: జీవితాంతం పవన్ కళ్యాణ్‌కు రుణపడి ఉంటామంటూ రైతన్నలు





**కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం (ప్రజా జ్యోతి)**పిఠాపురం నియోజకవర్గ రైతులకు సకాలంలో సాగునీరు అందించి రైతాంగానికి అండగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిఠాపురం ప్రాంత రైతులు జీవితాంతం రుణపడి ఉంటారని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు తెలిపారు. గురువారం పిఠాపురం నియోజకవర్గ రైతుల ఆధ్వర్యంలో గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలోని పీబీసీ కాలువ పిడిందొడ్డి వద్ద నిర్వహించిన పాలాభిషేకం, కృతజ్ఞత సభలో పిఠాపురం ఫైవ్ మ్యాన్ కమిటీ సభ్యులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, నాయకులు ఓదూరు కిషోర్ చేతుల మీదుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ, "రైతు ఈ దేశానికి వెన్నెముక. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. పంటలకు నీరు లేక ఇబ్బందులు పడుతున్న పిఠాపురం నియోజకవర్గ రైతుల సమస్యను అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న మా ఆరాధ్య నాయకులు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అధికార యంత్రాంగంతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి వెంటనే చర్యలు చేపట్టారు. ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులతో సమన్వయం చేసి ఏలేరు వ్యవస్థ ద్వారా 1,000 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేయించి సుమారు 53 వేల ఎకరాల ఆయకట్టుకు జీవం పోశారు. ఇది రైతాంగానికి గొప్ప ఊరటను కలిగించింది" అని అన్నారు. "పదవిని అధికారం కోసం కాదు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం వినియోగిస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్ . రైతు కష్టాన్ని తన కష్టంగా భావించి, ప్రతి ఎకరాకు నీరు చేరేలా కృషి చేసిన ఆయన సేవలను పిఠాపురం రైతాంగం ఎన్నటికీ మరచిపోదు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆచరణలో నిరూపించిన నాయకుడు పవన్ కళ్యాణ్ " అని కొనియాడారు. అనంతరం రైతులు మాట్లాడుతూ, "ఎన్నో రోజులుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న సమయంలో మా సమస్యను గుర్తించి వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మా హృదయపూర్వక కృతజ్ఞతలు. రైతు పక్షాన నిలిచిన ఈ సేవకు జీవితాంతం రుణపడి ఉంటాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, జనసేన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, నీటి సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి...సంక్షేమం కూటమి ప్రభుత్వంలోనే సాధ్యం





### రెండేళ్ల విజయం... అభివృద్ధి - సంక్షేమం
### ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో టిడిపి నాయకులు
### అభివృధి...సంక్షేమ పథకాలపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రజలు

**హోళగుంద, జూలై 30, ప్రజా జ్యోతి న్యూస్** - రాష్ట్ర అభివృద్ధి,ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని టిడిపి నాయకులు స్పష్టం చేశారు. గురువారం మండల పరిధిలోని మార్లమడికి గ్రామంలో రెండేళ్ల విజయం... అభివృద్ధి - సంక్షేమం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, కూటమి హయాంలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కుటుంబం ప్రభుత్వం అధికారం చేపట్టాక అభివృద్ధితో పాటు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పెన్షన్లు, దీపం పథకం కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, శ్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు సక్రమంగా అందుతున్నాయని గ్రామస్తులు అన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రంలో సుపరిపాలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాంది పలికారున్నారు. సూపర్ సంక్షేమ పథకాలతో పాటు గ్రామ గ్రామాన అభివృద్ధితో రాష్ట్రం దశ మారిందన్నారు. ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో ఆలూరు నియోజకవర్గం లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సరవేగంగా సాగుతున్నాయని గుర్తు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సి సి రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణాలతో గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయి అన్నారు. వైకుంఠం జ్యోతి నాయకత్వంలో ఇంటి నిర్మాణాలు చేపట్టే ప్రజలకు ఎలాంటి రుసుములు చెల్లించకుండా ఉచితంగా ఇసుక పంపిణీ జరుగుతుందన్నారు. ఎవరైనా ప్రజల వద్ద ఇసుక తరలింపుకు డబ్బు అడిగితే అంత దృష్టికి తీసుకురావాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ తిప్పయ్య,సీనియర్ నాయకులు రాజా పంపన్న గౌడ్, శేషగిరి,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ సుబాన్,సొసైటీ చైర్మన్ విష్ణు రెడ్డి, డైరెక్టర్ దుర్గయ్య, సీనియర్ నాయకులు ఎల్లార్తి మల్లికార్జున,మురళి, కరూర్ హుసేన్ పీర, కురువ మల్లి,గోపాల్, క్లస్టర్ ఇంచార్జ్ వీరేంద్ర,హనుమంతు,వలి బాషా,గిరి, తాహెర్,నూర్,నల్లారెడ్డి,ఉమేష్,భాస్కర్, గ్రామస్తులు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అన్నదేవరపేట గ్రామంలోఎల్ నీనో ప్రభావంపై అవగాహన కార్యక్రమం



**తాళ్లపూడి, జులై 30, ప్రజాజ్యోతి న్యూస్** అన్నదేవరపేట గ్రామంలో ఎల్ నీనో ప్రభావం -- ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్యం మరియు పంటల బీమా అంశాలపై అవగాహన- శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఎ డి ఎ సిహెచ్ శ్రీనివాస్ పాల్గొని రైతులు మరియు గ్రామస్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎల్ నీనో ప్రభావం కారణంగా ఏర్పడే వాతావరణ మార్పులు, వాటి వల్ల పంటలపై పడే ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలు, నీటి వనరుల సమర్థ వినియోగం, నీటి యాజమాన్య పద్ధతులు మరియు పంటల బీమా ప్రయోజనాల గురించి సభకు హాజరైన రైతులకు సమగ్రంగా వివరించారు. అలాగే కౌలు రైతు కార్డులు (సిసిఆర్ సి) యొక్క అవసరం, అర్హతలు, నమోదు విధానం మరియు వాటి ద్వారా లభించే ప్రభుత్వ ప్రయోజనాల గురించి కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి రుచిత ,సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్,వ్యవసాయ,ఉద్యాన శాఖ సిబ్బంది నవీన్, ఐశ్వర్య, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రౌడీలకు ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరిక

### తెనాలి పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు.. ట్రాఫిక్, డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి




**గుంటూరు జూలై 30 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ గురువారం తెనాలి 1టౌన్, 3టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డులు, పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వేగవంతమైన, పారదర్శక సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేసేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, గంజాయి, ఇతర డ్రగ్స్‌తో సంఘవిద్రోహ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఎనిమిది నెలల్లో ఎన్డీపీఎస్ చట్టం కింద 450 మందిపై కేసులు, 13 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు. రౌడీషీటర్లకు ప్రతి వారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, 'సంకల్పం' కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో సుమారు 300 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. రౌడీషీటర్లలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నప్పటికీ, మార్పు రాకపోతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, ట్రాఫిక్ సమస్యలను సమర్థవంతంగా నియంత్రించి జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా కరకా వెంకటరమణ కవల మనవళ్లకు నామకరణం

### వెలగపూడి సచివాలయంలో ఆప్యాయంగా పేర్లు పెట్టిన సీఎం
### పెద్ద బాబుకు 'రియాన్ష్', చిన్న బాబుకు 'విహాన్ష్'గా నామకరణం
### డొంకరాయి అభివృద్ధి అంశాలపై సీఎంకు వినతి పత్రం అందజేసిన వెంకటరమణ



**డొంకరాయి , అమరావతి, జూలై 30 (ప్రజాజ్యోతి):** వెలగపూడి సచివాలయంలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకటరమణ కుటుంబ సమేతంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డొంకరాయిని మండల కేంద్రంగా ప్రకటించాలని, డొంకరాయి జిల్లా పరిషత్ పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని, చింతూరు--మోతుగూడెం--డొంకరాయి--సీలేరు--దారకొండ మీదుగా రింతాడ జంక్షన్ వద్ద ఉన్న ఎన్‌హెచ్--516ఈను అనుసంధానించే కొత్త జాతీయ రహదారిని ఏర్పాటు చేయాలని సీఎంను కోరారు. అనంతరం కరకా వెంకటరమణ తన కవల మనవళ్లకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా నామకరణం చేయించి ఆశీర్వదించాలని కోరగా, సీఎం సానుకూలంగా స్పందించి పిల్లలకు ఆప్యాయంగా నామకరణం చేశారు. పెద్ద బాబుకు "రియాన్ష్", చిన్న బాబుకు "విహాన్ష్" అనే పేర్లను ప్రకటించి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో కరకా వెంకటరమణ, ఆయన సతీమణి కరకా జయకుమారి, పిల్లల తల్లిదండ్రులు రత్న, ప్రేమ కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరకా వెంకటరమణ మాట్లాడుతూ, తమ కవల మనవళ్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నామకరణం జరగడం తమ కుటుంబానికి జీవితాంతం మరువలేని ఆనందకరమైన సందర్భంగా నిలిచిపోతుందని అన్నారు. పిల్లల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి ఆశీర్వాదం శుభప్రదంగా ఉండాలని ఆకాంక్షించారు. తమ కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించిన ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు డాక్టర్ వక్కల ఉమా పుట్టినరోజు పురస్కరించుకొని అన్నదానం



**గుంతకల్లు జులై 30 (ప్రజా జ్యోతి):** రోటరీ క్లబ్ ఆధ్వర్యం లో ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు డాక్టర్ వక్కల ఉమా పుట్టినరోజు పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అన్నదానం కార్యక్రమం చేయడమైనది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు కె.రవికుమార్ మాట్లాడుతూ డాక్టర్ ఒక్కల ఉమా ఎంతో ఉన్నతమైన సేవా భావం గల వ్యక్తి ఎల్లప్పుడూ ఆమె పేదలకు సహాయం చేయాలని తపిస్తుంటుంది అందులో భాగంగా గురువారం ఈ అన్నదాత కార్యక్రమం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ బి. శ్రవణ్ కుమార్, రొటేరియన్ గుడిపాటి శ్రీనివాసులు, రొటేరియన్ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ శిరీష, రొటేరియన్ బి.రామాంజనేయులు, రొటీరియన్ ధనుంజయ, రొటేరియన్ ఇమీడియట్ పాస్ట్ అధ్యక్షులు సుధీర్, కారువ, రొటేరియన్ డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# పంటల భీమా నమోదు గడువును పెంచాలి

**:ఆర్ యన్ బాబురావు యాదవ్**



**గుంతకల్లు జూలై 30 (ప్రజా జ్యోతి):** పంటల భీమా నమోదు గడువును పెంచాలని, పంట బీమాను ప్రభుత్వమే చెల్లించాలని గుంతకల్లు నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెసు పార్టీ రైతు విభాగం అధ్యక్షులు ఆర్ యన్ బాబురావు యాదవ్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులు, కరువు లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే బీమా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది. కాబట్టి అర్హులైన రైతులు పంట బీమా నమోదుకు మీసేవ కేంద్రాల్లో సర్వార్లు బిజీ అవుతున్నాయని, ఈ సందర్భంగా రైతులు ఇబ్బందులకు గురవుతు న్నారని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి పంటల బీమా నమోదు గడువును ఆగస్టు 15 వరకు పెంచాలని, ప్రభుత్వమే పంట బీమా చెల్లించాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం తరపున డిమాండ్ చేస్తూ, ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ కి విన్నవించుకోవడం జరిగింది.

# మహిళల చట్టాలపై అవగాహన




**నందవరం జూలై 30 (ప్రజాజ్యోతి ):**అమాయకులైన మహిళలకు మాయమాటలు చెప్పి, వారిని అక్రమ మార్గాల్లో తరలించి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎమ్మిగనూరు జెసి జె కోర్టు జడ్జి పి.హేమ అన్నారు. గురువారం నందవరం గ్రామంలో జాతీయ మహిళల అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మహిళలను మాయమాటలు చెప్పి వారిని అక్రమంగా ఇతర దేశాలకు తీసుకెళ్లి విక్రయించడం, వారితో తప్పుడు పనులు చేయించడం లాంటి పనులు చేస్తే అలాంటి వారికి కఠిన శిక్షలు ఉంటాయన్నారు. అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో మహిళలు అన్ని విషయాలపై అవగాహనలు కలిగి ఉండాలని సూచించారు. ఇలాంటి సంఘటనలు ప్రజల దృష్టికి వేస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించి వారిని కాపాడాలని కోరారు. అలాగే ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు ఎక్కువ ఉన్నాయని వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు,పోలీస్ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను సందర్శించిన తహసీల్దార్.



**పోదూరు. ప్రజాజ్యోతి. జూలై 30.** పోదూరులోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (బాలురు ) స్కూల్ ను పోదూరు తహసీల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్ గురు వారం సందర్శించారు హాస్టల్ రూములు, క్లాస్ రూములు, డైనింగ్ హాలును తహసీల్దార్ పరిశీలించారు. 202 మంది విద్యార్థులకు గాను 196 మంది విద్యార్థులు హాజరైనట్లు గుర్తించారు. విద్యార్థులతో కలిసి తహసీల్దార్ భోజనం చేశారు. మెనూను అనుసరించి ఆహా రము సరఫరా చేస్తున్నట్లు ఆహార పదార్థములు రుచిగా ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు.

# అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన గుమ్మనూరు నారాయణస్వామి, డాక్టర్ హిమబిందు



**గుంతకల్లు జూలై 30 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని 7వ వార్డులో మున్సిపాలిటీ రూ: ఒక కోటి 52 లక్షలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు గుంతకల్లు టిడిపి మండల ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు తో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అది ఒక కారం లోకి వచ్చి రెండు సంవత్సరాలలో సంక్షేమం, అభివృద్ధి, అనేక పరిశ్రమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని, అందులో భాగంగానే గుంతకల్లు పట్టణంలో అనేక అభివృద్ధి పనులు నిర్వహిం చడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు మాజీ కౌన్సిలర్ శివన్న, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సురేష్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామప్ప, మునిస్వామి, మల్లయ్య, కుల్లాయప్ప, ఇంద్రమ్మ, మోహన్, లింగమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న జక్కంపూడి కుమార్.

**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. జూలై 30.** పాలకొల్లు కళాపరిషత్ కార్యదర్శి, బెంగళూరు పార్వతీ పరమేశ్వర దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్,ఘంటసాల సంగీత కళాపరిషత్ ఉపాధ్యక్షులు, ఏపీ హోటల్ అసోసియేషన్ కార్యదర్శి, జక్కంపూడి లక్ష్మీనరసింహ నాగేంద్ర కుమార్ జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం అందుకున్నారు.
జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ భవనంలో ఈనెల 28 న సాయంత్రం అత్యంత వైభవంగా జరిగిన "హస్తినలో తెలుగు వెలుగు వేడుకలు" కార్యక్రమంలో కుమార్ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గత రెండు దశాబ్దాలుగా జక్కంపూడి కుమార్ సాహిత్య, సాంస్కృతిక, ధార్మిక రంగాలలో అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఈ జాతీయ స్థాయి పురస్కారాన్ని అందజేశారు. పాలకొల్లు కళాపరిషత్ కార్యదర్శిగా మరియు ఘంటసాల సంగీత కళాపరిషత్ ఉపాధ్యక్షులుగా, ధర్మ పరిరక్షణ సమితి – మానవత సంస్థ లలో చురుకయిన పాత్ర పోషిస్తూ కళారంగం హిందూ ధర్మ పరిరక్షణకు, సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సౌత్ సెంట్రల్ రైల్వే డి.ఆర్.యు.సి.సి మెంబర్ గా ప్రయాణీకుల సౌకర్యాల కోసం చేస్తున్న సేవలను సంస్థ ప్రత్యేకంగా గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రివర్యులు భూపతిరాజు శ్రీనివాస వర్మ అధ్యక్షత వహించగా డాక్టర్ కే లక్ష్మణ్ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, రాజ్యసభ సభ్యులు మాగంటి శ్రీనివాస్ రెడ్డి ఒంగోలు లోకసభ సభ్యులు పి కృష్ణ మోహన్ రావు మాజీ చైర్మన్ తెలంగాణ బీసీ కమిషన్ గౌరవ ఎమ్మెల్సీ స్వామి వీర్రాజు ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ ఆక్వా పితామహుడు ఉత్తరాజు కాశీ విశ్వనాథ రాజు చైతన్య రాజు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ అఖిల విభజన శర్మ తిరుమల తిరుపతి దేవస్థానం పలువురు పార్లమెంట్ సభ్యులు శాసనసభ్యులు పాల్గొన్నారు కేసు రాజు రాంప్రసాద్ గారు ముత్యాల శ్రీనివాస్ గారు గాంధీ భగవాన్ రాజు గారు ఈ యొక్క కార్యక్రమానికి ఆహ్వానితులుగా నిర్వర్తించారు ఇంకా అనేకమంది పాల్గొని పురస్కార గ్రహీతలను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ ఈ జాతీయ గుర్తింపు పొందటం పాలకొల్లు కళాపరిషత్, ఘంటసాల కళాపరిషత్ మరియు ధర్మ పరిరక్షణ సమితి – మానవత సభ్యులందరి సహకారం ఉందని పేర్కొన్నారు.




# గొల్లప్రోలులో పారిశుద్ధ్య విప్లవం.. ప్రజల ప్రశంసలు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి

### బాధ్యతలు చేపట్టిన వారం రోజుల్లోనే పట్టణ రూపురేఖలు మారుస్తున్న కమిషనర్

### క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షణ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం







**కాకినాడ జిల్లా గొల్లప్రోలు, జూలై 30: (ప్రజా జ్యోతి) (ప్రతినిధి. బోర శివారెడ్డి)** గొల్లప్రోలు పురపాలక సంఘంలో పారిశుద్ధ్య నిర్వహణకు కొత్త ఊపిరి లభిస్తోంది. ఇటీవలే మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన దివిజ సంపతి కేవలం వారం రోజుల వ్యవధిలోనే తన పనితీరుతో ప్రజల ప్రశంసలు అందుకుంటు న్నారు. కార్యాలయానికే పరిమితం కాకుండా ప్రతి రోజు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వెంటనే పరిష్కార చర్యలు చేపడుతుండటం విశేషం.గురువారం పట్టణంలోని సూరంపేట ప్రాంతంలో విస్తృతంగా పర్యటించిన కమిషనర్ దివిజ సంపతి, పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిం చారు. సూరంపేట వెళ్లే మార్గంలోని రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద భారీగా మట్టి పేరుకుపోయి వాహనదారులు, పాదచారులు ,తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గమనించిన ఆమె వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. ఆలస్యం చేయకుండా మినీ జేసీబీని రంగంలోకి దించి మట్టిని పూర్తిగా తొలగింపజేయడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బందితో మొత్తం ప్రాంతాన్ని శుభ్రం చేయించి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకున్నారు.సమస్యను గుర్తించిన వెంటనే పరిష్కారం చూపిన కమిషనర్ తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే అంశాలపై ఇలాంటి వేగవంతమైన స్పందన అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.అండర్‌పాస్ వద్ద పనులను పూర్తి చేయించిన అనంతరం కమిషనర్ దివిజ సంపతి సూరంపేటలోని వీధులన్నింటిలోనూ పర్యటించారు. డ్రైనేజీలు, రహదారుల పరిస్థితి, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**వారం రోజుల్లోనే కనిపిస్తున్న మార్పు**

బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రతి రోజు వార్డుల్లో పర్య టిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం కమిషనర్ ప్రత్యేకతగా నిలుస్తోంది. ఎన్నో రోజులుగా మరమ్మతులకు నోచుకోని వీధి లైట్లను పునరుద్ధరించడం, మురుగు కాలువలను యుద్ధప్రాతిపదికన శుభ్రం చేయించడం, పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయించడం వంటి చర్యలతో గొల్లప్రోలు పట్టణ రూపురేఖలు వేగంగా మారుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ప్రజల సమస్యలను స్వయంగా పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవడం వల్ల పురపాలక వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని పలువురు పేర్కొన్నారు. ఇదే తీరులో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగితే గొల్లప్రోలు పరిశుభ్రమైన, ఆదర్శ పట్టణంగా నిలుస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఈ పర్యటనలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రఘు ప్రసాద్, శానిటరీ సెక్రటరీలు, అమెనిటీ సెక్రటరీ సాయి దుర్గ, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ ఉప కులాల రైతులకు టార్పాలిన్లు మరియు బ్యాటరీ స్ప్రేయర్లను పంపిణీ చేసిన పరిశోధన స్థానం, డైరెక్టర్ డా. సి. తారా సత్యవతి







**ఎమ్మిగనూరు, జులై 30(ప్రజా జ్యోతి ):** మండల పరిధిలో ని కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసిలో భారతీయ చిరుధాన్యాల పరిశోధన స్థానం, హైదరాబాద్ సహకారంతో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద ఎంపిక చేసిన చిరుధాన్య రైతులకు టార్పాలిన్లు మరియు బ్యాటరీ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ చిరుధాన్యాల పరిశోధన స్థానం, హైదరాబాద్ డైరెక్టర్ డా. సి. తారా సత్యవతి, డా. కె. శ్రీనివాస బాబు, సీనియర్ సైంటిస్ట్, డా. సంగప్ప, సైంటిస్ట్, డా. కె. రాఘవేంద్ర చౌదరి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, కేవీకే బనవాసి పాల్గొని ఎంపిక చేసిన రైతులకు వ్యవసాయ ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా డా. సి. తారా సత్యవతి మాట్లాడుతూ, చిరుధాన్యాలు తక్కువ నీటితో సాగు చేయగలిగే, వాతావరణ ప్రతికూల పరిస్థితులను తట్టుకునే పోషక విలువలు కలిగిన పంటలని తెలిపారు. రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించి చిరుధాన్యాల విస్తీర్ణం, ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద అందిస్తున్న టార్పాలిన్లు, బ్యాటరీ స్ప్రేయర్లను సద్వినియోగం చేసుకొని సాగు పనులను సులభతరం చేసుకోవాలని కోరారు.డా. కె. శ్రీనివాస బాబు మాట్లాడుతూ, చిరుధాన్యాల సాగులో సరైన సమయంలో చేపట్టే పంట యాజమాన్య పద్ధతులు అధిక దిగుబడికి కీలకమని తెలిపారు. ఆధునిక వ్యవసాయ పరికరాల వినియోగం ద్వారా శ్రమ, సమయం మరియు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.డా. సంగప్ప మాట్లాడుతూ, రైతులు నాణ్యమైన విత్తనాల ఎంపిక నుంచి పంట కోత, పంట అనంతర యాజమాన్యం వరకు శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు. చిరుధాన్యాలకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని రైతులు అవకాశంగా మలుచుకొని మెరుగైన ఆదాయం పొందాలని తెలిపారు.డా. కె. రాఘవేంద్ర చౌదరి మాట్లాడుతూ కేవీకే బనవాసి రైతులకు నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణలు, క్షేత్ర ప్రదర్శనలు మరియు శాస్త్రీయ సలహాలను అందిస్తోందని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద ఎంపిక చేసిన చిరుధాన్య రైతులకు అందించిన టార్పాలిన్లు, బ్యాటరీ స్ప్రేయర్లను సమర్థవంతంగా వినియోగించుకొని సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు చిరుధాన్యాల సాగు, పంట యాజమాన్యం, ఆధునిక సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఎంపిక చేసిన చిరుధాన్య రైతులు, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గోదావరి వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండండి

**ఐ టీ డి ఎ పి ఓ**

**చింతూరు జూలై 30 ప్రజాజ్యోతి** గోదావరి వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐపిడిఏపిఓ శుభం నొక్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు.ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదితో పాటు దాని ఉపనదులలో భారీగా వరద నీరు ప్రవహిస్తోందన్నారు . దీనివల్ల గోదావరి నదిలో నీటి మట్టం నిరంతరం పెరిగే అవకాశం ఉంది. తాజా వరద అంచనాల ప్రకారం, భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం రేపు (31 జూలై) ఉదయం మొదటి హెచ్చరిక స్థాయికి చేరుకునే అవకాశం ఉందని,అనంతరం (1 ఆగస్టు) రెండవ హెచ్చరిక స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అంచనా వేయబడిందన్నారు . ఈ నేపథ్యంలో గోదావరి, శబరి నదుల పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. గోదావరి, శబరి నదుల ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరదల సమయంలో అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దు. వరద నీటితో మునిగిపోయిన రహదారులు, వంతెనలు, కల్వర్టులు, వాగులు ఇతర జలమార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దన్నారు. జిల్లా పరిపాలన, సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారుల కు పూర్తిగా సహకరించాలని తెలిపారు .ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లయితే వెంటనే సబ్ కలెక్టర్ కంట్రోల్ రూమ్ లేదా సంబంధిత మండల తహసీల్దార్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు.

కంట్రోల్ రూమ్ సంప్రదింపు నంబర్లు

1. సబ్ కలెక్టర్ కంట్రోల్ రూమ్
9490026397
8121729228
2. కూనవరం కంట్రోల్ రూమ్
9652814712
3. వి.ఆర్. పురం కంట్రోల్ రూమ్
78939 46774
4. చింతూరు కంట్రోల్ రూమ్
9492527695
5. ఏటపాక కంట్రోల్ రూమ్
8332085268 ఫోన్ చేయాలనీ




ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, పుకార్లను నమ్మవద్దని, అధికారికంగా జిల్లా పరిపాలన విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే విశ్వసించి, అధికారులు జారీ చేసే సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని పి ఓ విజ్ఞప్తి చేశారు.

# పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి





**కాకినాడ జిల్లా పిఠాపురం (ప్రజా జ్యోతి) పిఠాపురం:** ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డా. జ్యోతుల రాంబాబు గురువారం ఉదయం ఆకస్మికంగా సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. కళాశాల పనితీరు, విద్యా ప్రమాణాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డా. రాంబాబు తరగతి గదులను సందర్శించి విద్యార్థులు సమయానికి హాజరవుతున్నారా లేదా అనే అంశాన్ని అడిగి తెలుసుకున్నారు. కళాశాల ఆవరణ, తరగతి గదుల పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడి పలు కీలక సూచనలు, సలహాలు అందించారు.

**కళాశాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ**


ఈ సందర్భంగా డా. జ్యోతుల రాంబాబు మాట్లాడుతూ, పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధిపై తాను ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో కళాశాలలో విద్యార్థుల నమోదు మరింత పెరిగేలా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉన్నందున విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.ఆర్.కె. రెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై స్పందిస్తూ అందరివాడిగా పేరు గడించిన చింతపల్లి సుధాకర్...!!



**జి.కొండూరు :(జూలై 30,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):** ఎన్.టి.ఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధిలోని వెల్లటూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువనేత, వెల్లటూరు సహకార సొసైటీ చైర్మన్ చింతపల్లి సుధాకర్ మొదటి నుండి తెలుగుదేశం పార్టీ లో కొనసాగుతూ పార్టీ అధికారంలో వున్నా.. లేకపోయిన ప్రజా సమస్యల పై స్పందిస్తూ తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ అందరివాడిగా పేరు గడించారు అనడంలో అతియోశక్తి కాదు. అలాగే శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశానుసారం పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా సుధాకర్ పేరు గడించారు. గ్రామంలో ఈ మధ్యకాలంలో పలువురు రైతుల పాడి గేదెలు,అలాగే బైక్ లు చోరీలకు గురవుతుంటే... బాధితులకు అండగా నిలిచి స్థానిక స్టేషన్ ఎస్ఐ కు చెప్పి చోరీలకు గురైన వాటిని రికవరీ చేయించి బాధితులకు అండగా నిలిచారు. అలాగే భీమవరప్పాడు ఎస్సీ కాలనీలోని స్మశాన వాటికలో అలాగే కోడూరు గరువు మాలపల్లి ఎస్సీ కాలనీలో స్మశాన వాటికలో చెత్తాచెదారంతో ముళ్ళ పొదలతో పేరుకుపోయిన ముళ్ళ చెట్లను తొలగించి 40 వేల రూపాయల స్వంత ఖర్చులతో జంగిల్ క్లియర్ చేయించడంలో యస్. సి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పలు సమస్యలతో ఉన్న సహకార సొసైటీని సహకార సొసైటీ చైర్మన్ గా చింతపల్లి సుధాకర్ సమయ స్ఫూర్తితో వ్యవహరిస్తూ...సమస్యలను పరిష్కరిస్తూ నష్టాల్లో ఉన్న సొసైటీని లాభాల్లో ఉండటానికి బ్యాంకు రుణం పొందిన రైతుల నుండి రికవరీ చేయిస్తూ, నూతనంగా రైతులకు రుణాలను ఇప్పిస్తూ బాధ్యతగా విధులు నిర్వహిస్తుండడంతో పలువురు రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అడ్డగోలు పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు ఎస్సై రామకృష్ణ హెచ్చరిక



**తాళ్లపూడి, జూలై 30 ప్రజాజ్యోతి న్యూస్** అడ్డగోలుగా వాహనాలు పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని తాళ్లపూడి ఎస్సై టి. రామకృష్ణ వాహనదారులను హెచ్చరించారు. ముఖ్యంగా తాళ్లపూడి మెయిన్ బజార్‌లో ద్విచక్ర వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్డు మధ్యలో వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బందితో కలిసి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా పార్క్ చేసిన పలు ద్విచక్ర వాహనాలకు చలానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రాణం చాలా విలువైనదని, ద్విచక్ర వాహనదారులు తమ రక్షణ కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. అలాగే ప్రతి వాహనదారుడు వద్ద ఆర్.సి, లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను కలిగి ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి వారికైనా కఠిన చర్యలు తప్పని భవిష్యత్‌లో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని ఎస్సై స్పష్టం చేశారు

# పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి విడుదల చేసిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



**కాకినాడ జిల్లా జూలై 30 (ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలో పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యంతో రైతుల పంట సాగుకు సాగునీటిని విడుదల చేశారు. ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) సాగునీటి విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ఎత్తిపోతల పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. నీటి వనరులను సద్వినియోగం చేసుకుని రైతులు అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుద్ధ సూర్య ప్రకాష్,ఎంపీటీసీ సభ్యులు బుద్ధ సత్యవతి ఈశ్వరరావు, సుంకర సత్యనారాయణ,గ్రామ కూటమి నాయకులు,కాలువ సంఘ సభ్యులు,అధికారులు,రైతులు పాల్గొన్నారు.రైతులు సాగునీటి విడుదలపై హర్షం వ్యక్తం చేశారు.

# గంజాయి పట్టివేత



**చింతూరు జూలై 30 ప్రజాజ్యోతి** చింతూరు ఎస్సై సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పక్కా సమాచారంతో మధ్యాహ్నం మూడు గంటలకి చింతూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద గంజాయి అక్రమ రవాణా చేస్తుండగా రాజస్థాన్ కి చెందిన ఇద్దరు వ్యక్తుల నుండి 6 కేజీల పట్టుకున్నారు.గంజాయి తో పాటు రెండు సెల్ ఫోన్లు ఆధార్ కార్డు జిరాక్స్ లు కాపీలు సీజ్ చేశారు.రాజస్థాన్ కి చెందిన రాహుల్ సైన్, జై సింగల్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు . ఈ తనిఖీల్లో చింతూరు ఎస్సై ఎం సంతోష్ కుమార్ మోతుగూడెం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్,అన్వేష్, విఆర్ఓ, వీఆర్ఏ, చింతూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి విలువ సుమారు మూడు లక్షల ఉంటుందని ఎస్సై తెలిపారు.

# ఎమ్మిగనూరు బీజేపీలో సంస్థాగత బలోపేతంపై చర్చ



**ఎమ్మిగనూరు, జులై 30(ప్రజా జ్యోతి ):** ఎమ్మిగనూరు నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కార్యాలయాన్ని కర్నూలు జిల్లా జనరల్ సెక్రెటరీ గొందిపల్లె మాలతి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి గురురాజ్ దేశాయ్‌తో పాటు పార్టీ నాయకులతో నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బి.ఎల్. నారాయణ,మాజీ సర్పంచ్ రామన్న గౌడ్, పద్మావతి, గాజుల సురేంద్ర, గద్వాల రవి నాయుడు, కల్లెల శివ, రంగస్వామి, సోషల్ మీడియా కన్వీనర్ వాల్మీకి దండు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రభివృద్ధి మరియు సంక్షేమం సాధ్యం..

**–ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం నందు మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు,టిబిపి చైర్మన్ టిప్పుసుల్తాన్**



**కౌతాళం,జులై 30 ప్రజా జ్యోతి** గురువారం రోజున కౌతాళం మండలం బధినేహళ్ మరియు ఏరిగేరి గ్రామం నందు కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు సురేష్ నాయుడు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, గ్రామ అభివృద్ధి మరియు రాష్ట్రం సాధించిన ప్రగతి ఆకర్షించిన పెట్టుబడిదారులు వివరిస్తూ,గ్రామ సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు రామలింగ అన్న,నరసింహ అన్న, స్టేషన్ బసవరాజు, బడినేహల్ వీరేష్ భీమన్న,భీమేశ్, షేక్షావలి గాభుగా రమేష్,శ్రీరాములు, వీరేష్, రంగ,షబ్బీర్,వీరేష్,డేవిడ్, రామకృష్ణ, నాగరాజు మొదలగు వారు పాల్గొనడం జరిగినది

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం





**– రెండు రోజుల ముందుగానే పింఛన్లు పంపిణీ**

**– లబ్ధిదారులకు ఫించన్లు అందజేసిన రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ**

**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** ప్రజా సంక్షేమమే ద్యేయంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలనకు నిదర్శనంగా నిలుస్తుంది ని రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ అన్నారు. ఆగష్టు ఒకటవ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం నేపథ్యంలో పొందూరు మండల కేంద్రంలో రెండు రోజుల ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాంభజన వీధిలో లబ్దిదారులకు అనకాపల్లి విజయలక్ష్మీ స్వయంగా ఫించన్ దారుల ఇంటికి వద్దకు వెళ్ళి ఫించన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పాలనకు పెద్దపీట వేస్తుందన్నారు. ఒకటవ తేదీ నాటికి లబ్ధిదారుడి గడప వద్దకే ఫించన్ అందేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. విమానాశ్రయం ప్రారంభోత్సవం కారణంగా రెండు రోజుల ముందుగానే పింఛన్లు పంపిణీ చేయడం ప్రభుత్వ ప్రజాహిత దృక్పథానికి నిదర్శనం అన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా వృద్ధులు వితంతువులు వికలాంగులు దివ్యాంగులు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామన్నారు. అభివృద్ధి సంక్షేమాన్ని సమన్వయం చేసుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని పురోగతి దిశగా నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర రావు ,కూటమి నాయకులు, కార్యకర్తలు,లబ్దిదారులు పాల్గొన్నారు.

# నిమ్మలపాడు కాల్సైట్ మైనింగ్‌పై సమగ్ర, విచారణ జరపాలి

**నిమ్మలపాడు గ్రామ ప్రజలు డిమాండ్.**

**అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం**

**అనంతగిరి మండలం. జులై 30. ప్రజా జ్యోతి న్యూస్ రిపోర్టర్ శంకర్.** వాలాసి పంచాయితీ.నిమ్మలపాడు రెవెన్యూ ప్రాంతంలో జరుగుతున్న కాల్సైట్ మైనింగ్‌పై పూర్తి స్థాయి, విచారణ జరపాలని నిమ్మలపాడు గ్రామ ప్రజలు జిల్లా యంత్రాంగాన్ని కోరారు.మైనింగ్ జరుగుతున్న ప్రాంతంలో ఆదివాసీ రైతులకు చెందిన జిరాయితీ భూములు, డి–పట్టా భూములు ఉన్నప్పటికీ, వాటిని ఏ విధంగా స్వాధీనం చేసుకున్నారనే అంశంపై ఏ.పీ.ఎం.డీ.సీ స్పష్టమైన వివరాలు ఇవ్వడం లేదని తెలిపారు. సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) ద్వారా వివరాలు కోరినా పూర్తి సమాచారం అందించడం లేదని ఆరోపించారు.పీసా చట్టం ప్రకారం గ్రామసభ నిర్వహించకుండా, గ్రామ ప్రజల అనుమతి లేకుండా, పంచాయతీ తీర్మానం లేకుండానే మైనింగ్ ప్రక్రియ కొనసాగించారనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం ఎటువంటి జీ.వో.లు ఆధారంగాలీజులు మంజూరుచేశారో ప్రజలకు వెల్లడించలేదని అన్నారు.గతంలో ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ప్రజలు మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకించిన సందర్భాలు ఉన్నాయి .అనంతగిరి మండలంతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజలకు తెలిసిందేనని గ్రామస్థులు తెలిపారు. సమతా తీర్పు (సమత జడ్గ్మెంట్) ప్రకారం ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల ప్రయోజనాలకు విరుద్ధంగా మైనింగ్ కార్యకలాపాలు ఉండకూడదని, స్థానిక ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా చట్టాలను అమలు చేయాలని పేర్కొన్నారని గుర్తుచేశారు. మైనింగ్ ప్రాంతంలో సుమారు 60. ఎకరాల గ్రామస్థుల భూములు ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటి వరకు పంచాయతీకి మైనింగ్ శాఖ లేదా ఏ.పీ.ఎం.డీ. సీ నుంచి ఎలాంటి నిధులు అందలేదని, పంచాయతీ ఖాతాలను పరిశీలిస్తే విషయం స్పష్టమవుతుందని అన్నారు. కొంతమంది వ్యక్తులు ప్రజలను విభజిస్తూ, మైనింగ్‌కు వ్యతిరేకంగా ప్రశ్నించే వారిపై ఒత్తిళ్లు, బెదిరింపులు, దాడులు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. ఆరోపణలపై కూడా సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. అలాగే, మైనింగ్ వ్యవహారంలో రాజకీయ బడా బాబుల హస్తాలు ఉన్నాయని గ్రామస్థులు ఆరోపించారు. ఆరోపణల నిజానిజాలను ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ ద్వారా వెలికితీయాలని కోరారు. రాష్ట్రగవర్నర్‌కు విషయంపై ఫిర్యాదు చెయ్యగా జిల్లా కలెక్టర్‌కు విచారణ జరపాలని ఆదేశాలు జారీ అయినప్పటికీ, విచారణ ముందుకు సాగడం లేదని గ్రామస్థులు పేర్కొన్నారు.



**గ్రామ ప్రజల ప్రధాన డిమాండ్లు**

నిమ్మలపాడు కాల్సైట్ మైనింగ్‌పై సమగ్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టాలి.మైనింగ్ ప్రాంతంలో ఉన్న జిరాయితీ, డి–పట్టా భూముల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలి.ఏ రైతుకు ఎంత భూమి ప్రభావితమైందో వెల్లడించాలి.పీసా గ్రామసభ ఎప్పుడు నిర్వహించారో, ఎంతమంది సంతకాలు చేశారో వెల్లడించాలి.పంచాయతీ తీర్మానం ఉందా లేదా అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలి.ఏ.పీఎం.డీ.సీ ఏ జీ.వో ప్రకారం లీజులు మంజూరు చేసిందో వెల్లడించాలి.లీజు మంజూరు చేసినప్పటి నుంచి రైతులకు, పంచాయతీకి ఎంత పరిహారం లేదా నిధులు చెల్లించారో వెల్లడించాలి.ఐదో షెడ్యూల్ ప్రాంతంలో సమతా తీర్పు పీ.సా చట్టం నిబంధనలకు అనుగుణంగా మైనింగ్ జరుగుతోందా అనే అంశాన్ని స్వతంత్ర సంస్థతో విచారించాలి.విచారణను అడ్డుకుంటున్న వ్యక్తులు ఎవరైనా ఉంటే వారిపై కూడా చర్యలు తీసుకోవాలి. నిమ్మలపాడు మైనింగ్ వ్యవహారంపై అన్ని అంశాలను సమగ్రంగా దర్యాప్తు చేసి, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిమ్మలపాడు గ్రామ ప్రజలు కోరారు.

# విద్యార్థులకు భూగర్భ జలాల పరిరక్షణపై అవగాహన సదస్సు





**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ ( ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ ) ప్రాంతీయ సంచాలకులు ఎన్ జ్యోతి కుమార్ ఆధ్వర్యంలో భూగర్భ జలాల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్ మధుసూదన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎన్ జ్యోతికుమార్ మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంపొందించుకునే మార్గాలు ,ప్రతీ వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలలోకి ఇంకేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత గురించి వివరించారు. అలాగే ఎల్ . ని. నో ప్రభావం వల్ల ఏర్పడే వాతావరణ మార్పులు ,వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు రైతులు అనుసరించాల్సిన పంటల ఎంపిక నీటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు అకాడమిక్ మార్గదర్శకత్వం ఉన్నత విద్య, వ్యక్తిత్వ వికాసం ఆత్మ విశ్వాసం పెంపొందించుకునే అంశాలపై విలువైన సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ ఉన్నతాధికారులైన నాగేశ్వర రావు సూచేతన విశ్వాస్ ,కొల్లి రాంబాబు దామోదర్ ,కళాశాల అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ సంయుక్త కార్యదర్శి ఐషీ ఘోష్ను అక్రమ నిర్బంధాన్ని ఖండిస్తూ వామపక్షాలు నిరసన




**అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు**

**గుంతకల్లు జులై 30 (ప్రజా జ్యోతి):** జంతర్ మంతర్ వద్ద ఉద్యమంపై ప్రతికార చర్యలకు కేంద్ర పాల్పడు తు, విద్యార్థుల నాయకు లపై పాత చేతులను బయటికి తీసి వేటాడు తుంది, ఢిల్లీలోని సిపిఎం ప్రధాన కార్యాలయంలో పోలీసులు చొరబడి ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఐషీ ఘోష్ను అరెస్టు చేయడానికి ఖండిస్తూ గుంతకల్లు సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమో క్రసీ పార్టీల ఆధ్వర్యంలో గురువారం స్థానిక పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి మురళి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మహిళా సంఘం నాయకురాలు ఆశా మాట్లాడుతూ ధర్మేందర్ ప్రధాన్ రాజీనామాతో ఉద్యమకారులపై ఉక్కు పాదం మోపేందుకు ఎస్ఎఫ్ఐ జాతీయ మోడీ ప్రభుత్వం సిద్ధపడిందని, ఐషీ ఘోష్ ఢిల్లీ పోలీసుల అక్రమ అరెస్టు చేయడానికి కక్ష సాధింపు చర్యలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని సిపిఎం కేంద్ర కార్యాలయం లోకి పోలీసులు మఫ్టీ దుస్తులతో వెళ్లి అక్కడి వారిని భయభ్రాంతులకు గురి చేస్తు అక్రమంగా అరెస్ట్ చేసేందుకు యత్నించడం ప్రజాస్వామ్య విరుద్ధం అన్నారు. పోలీసులు కనీసం యూనిఫామ్ కూడా లేకుండా ప్రపయివేటు వాహనాల్లో రావడం ఏమిటంటూ నిలదీశారు. జెనె జెడ్ విద్యార్థుల నిరసనలకు మద్దతుగా నిలిచిన వామపక్ష విద్యార్థులపై మోడీ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతోంద న్నారు. రాజకీయ పార్టీ కార్యాలయంలోకి పోలీసులు అక్రమంగా చొరబడటం, విద్యార్థి ఉద్యమ నాయకులను వేధిస్తూ ప్రజా స్వామ్య హక్కులను ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం కాలరా స్తోందన్నారు. ప్రశ్నించే గొంతు నొక్కడం, నిరసన లను నేరంగా ముద్రించే ప్రయత్నం కొనసాగుతోందని విమర్శించారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు భయపడేది లేదని, ఇలాంటి వాటిని మరింత గట్టిగా ఎదిరిస్తామని హెచ్చరించా రు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సురేంద్ర, పట్టణ నాయకులు చంద్రశేఖర్, శాషా, జ్యోతి, వెంకీ, వంశీ, రాము, ప్రసాద్, ఈరన్న, సుగుణ, ఆదిలక్ష్మి, అరుణజ్యోతి, రాణి, సిపిఐ నాయకులు దాసరి శ్రీనివాసులు, వెంకట్ నాయక్, పుల్లయ్య, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు తురకపల్లి రామాంజనేయులు, రాందాసు, నారాయణ, భాష వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి హయాంలో 13500 మంది గిరిజనులకు ఆధార్.

**సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.**



**ముత్తుకూరు, జూలై 30 (ప్రజా జ్యోతి)** టిడిపి హయాంలో 13500 మంది గిరిజనులకు ఆధార్ కార్డులు ఇప్పించామని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బ్రహ్మదేవి గ్రామపంచాయతీ గిరిజన కాలనీలో ఆయన పర్యటించారు. అధికార పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మ, సర్వేపల్లి నియోజకవర్గ టిడిపి ముస్లిం మైనార్టీ అధికార ప్రతినిధి షేక్ అలీ ముత్తు, సాగునీటి సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రావు, ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటి నలభై లక్షల 90 వేల రూపాయలతో ఏర్పాటైన ఉచిత సోలార్ పథకాన్ని గిరిజన కాలనీలో ప్రారంభించారు. హై స్కూల్ నందు డిజిటల్ ల్యాబ్ ప్రారంభించారు. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఈ కార్యక్రమానికి ఉద్దేశించి ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పరిపాలనలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. టిడిపి పరిపాలనలో పరిశ్రమల సిఎస్సార్ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చేస్తూ ఉన్నామని ఎమ్మెల్యే సోమిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మరమ్మత్తులు కారణంగా నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :**పొందూరు మండలం లోలుగు సబ్ స్టేషన్‌లో గల లైన్ అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించుటకు ఇతర అత్యవసర మరమ్మత్తు పనుల చేయుటకు గాను నేడు శుక్రవారం నాడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏ.ఈ సుధీర్ పత్రికా ప్రకటనలో తెలిపారు. లోలుగు సబ్ స్టేషన్ పరిధిలో గల లోలుగు ఇండస్ట్రియల్ ఫీడర్, నందివాడ ఫీడర్ లో గల లోలుగు గ్రామం ఇండస్ట్రియల్ సర్వీసెస్ నందివాడ గ్రామం , ఎన్.ఎస్.పి అగ్రహారం ,భగవాన్ దాసుపేట కేసుదాసుపురం అగ్రికల్చర్ సర్వీసెస్ కి విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని పేర్కొన్నారు. ఆయా గ్రామాల వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# ముద్రగడ కుటుంబాన్ని పరామర్శించిన బీసీవై అధినేత బోడె రామచంద్ర యాదవ్

**--ముద్రగడ సమాధి వద్ద నివాలులు..**

**--విజయవాడలో ముద్రగడ విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటన**



**కాకినాడ జిల్లా జులై 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కిర్లంపూడిలో మాజీ మంత్రి,కాపు కాపు ఉద్యమ నేత, స్వర్గీయ ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులను బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ పరామర్శించారు.అనంతరం ముద్రగడ కుమారుడు,ప్రత్తిపాడు వైసీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబుతో కలిసి ముద్రగడ సమాధి వద్ద పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ పెద్దాయన ముద్రగడ పద్మనాభం లేని లోటు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరనిదన్నారు.జాతి అభ్యున్నతి,ప్రజల హక్కుల సాధన కోసం జీవితాంతం రాజీలేని పోరాటం చేసిన మహానాయకుడిగా ఆయనను కొనియాడారు.నాలుగేళ్ల క్రితం ముద్రగడను కలిసినప్పుడు తనపై ఎంతో ప్రేమ,ఆప్యాయతలు చూపించారని గుర్తు చేసుకున్నారు.ఎలాంటి పదవులను ఆశించకుండా ప్రజల కోసం,సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేసిన అరుదైన నాయకుడిగా ముద్రగడ నిలిచారని పేర్కొన్నారు.ముద్రగడ ఆశయాలను కొనసాగిస్తూ ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగుతామని తెలిపారు.విజయవాడలో ముద్రగడ పద్మనాభం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.ముద్రగడ ఆశయాలను కొనసాగించే శక్తి,సంకల్పం ఆయన కుమారులకు కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు.ఆయన పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని,ముద్రగడ సేవలను ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం,ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీవై పార్టీ అధ్యక్షులు శీరం శ్రీను,గొంప శివకుమార్,బీసీవై జిల్లా కన్వీనర్ రాయుడు నాగేశ్వరావు,రాష్ట్ర పిఏసి సభ్యులు అత్తిలి రాజు,గొల్లప్రోలు మండల బీసీవై కన్వీనర్ మోరుకుర్తి శివ,నాయకులు తోట రామకృష్ణ,గౌతు స్వామి,నైదాన రఘు,సానబోయిన ఆదిబాబు,కుండల శ్రీను తదితరులు పాల్గొన్నారు

## ప్రపంచ మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం



**డోన్ ప్రజా జ్యోతి జూలై 30** నంద్యాల జిల్లా డోన్, పట్టణ సీఐ ఇంతాజ్ భాష ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారుప్రపంచ మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద సీఐ ఇంతాజ్ భాష, ఎస్సైశరత్ కుమారరెడ్డి, ఏ ఎస్ఐవెంకటరమణ, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలోమహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ, ఎస్సై, మాట్లాడుతూ మానవఅక్రమరవాణా అనేది సమాజానికి తీవ్ర ముప్పుగామారిందని, ఉద్యోగాలు, విద్య, వివాహం వంటి పేర్లతో మోసపూరితంగా మహిళలు, బాలికలను అక్రమ రవాణాకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల భద్రత, చట్టపరమైన రక్షణ, అనుమానాస్పద వ్యక్తులు, మనకు తెలియని కొత్త మనుషులు కనిపిస్తే, లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు, అలాగే మహిళలు అపరిచితుల మాటలను నమ్మి ఎక్కడికి వెళ్లరాదని, తమ వ్యక్తిగత విషయాలను తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని, అత్యవసర పరిస్థితుల్లో డయల్-112కు కాల్ చెయ్యండి అని సూచించారు.మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కావాలని అత్యంత కీలకమని, ప్రతి మహిళా ,విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖకు సహకరించాలని తెలిపారు.

## పట్టణ ప్రణాళిక పనుల్లో పారదర్శకత ఉండాలి

**మున్సిపల్ కమిషనర్ కృష్ణ**



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జులై 30 (ప్రజా జ్యోతి)** బద్వేల్ పురపాలక సంఘం కమిషనర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మున్సిపల్ కమీషనర్ యం.కృష్ణ గారి అధ్యక్షతన పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) కార్యకలాపాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డు ప్లానింగ్ మరియు రెగ్యులేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.పట్టణ ప్రణాళికకు సంబంధించిన వివిధ అంశాలు, భవన నిర్మాణ అనుమతులు, అనధికార నిర్మాణాల నివారణ, ప్రభుత్వ నిబంధనల అమలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం, క్షేత్రస్థాయి తనిఖీల పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ, పట్టణ ప్రణాళికకు సంబంధించిన అన్ని పనులను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా అందరూ సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత ఉన్నతాధికారులు, వార్డు ప్లానింగ్ మరియు రెగ్యులేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సెక్రటరీగా కొండపల్లి చిన్న సుబ్బారావు నియామకం




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జులై 30 (ప్రజా జ్యోతి)** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర సెక్రటరీగా బద్వేల్ కు చెందిన కొండ పల్లి చిన్న సుబ్బారావును నియమించారు.ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధి, విజయవాడలో సంఘ సొంత భవన నిర్మాణం, మరియు సంఘీయుల అభ్యున్నతి కోసం రాబోయే రెండు సంవత్సరాలు చిన్న సుబ్బా రావు గారు కృషి చేయను న్నారు.ఈ నియామకాన్ని మహాసభ అధ్యక్షులు ఎల్లూరు లక్ష్మయ్య( కర్నూలు), ప్రధాన కార్యదర్శి మాతూరి రంగనాథ్ (గుడివాడ), కోశాధికారి సిద్ధ సూర్య ప్రకాశ రావు( ఒంగోలు)లు ఆమోదించారు.చిన్న సుబ్బారావు గత 40 సంవత్సరాలుగా ఆర్యవైశ్య సంఘానికి అవిరళ సేవలు అందిస్తున్నారు.1982లో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా తన ప్రస్థానం ప్రారంభించారు. 1983లో ఆర్యవైశ్య వర్తక సంఘం సభ్యులుగా, 1984లో ఉపాధ్యక్షులుగా 11 సంవత్సరాలు పనిచేశారు. 1995లో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించి 2002 వరకు అమ్మవారి సేవలో నిమగ్నమయ్యారు. 2012లో భారీ మెజారిటీతో అధ్యక్షులుగా ఎన్నికై 2016 నుండి 2018 వరకు కొనసాగారు. 2025లో మళ్లీ భారీ మెజారిటీతో ఎన్నికై అమ్మవారి సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు.కరోనా సమయంలో అనేకమందికి అండగా నిలిచి సేవలు అందించారు. 1995లో మైదుకూరు రోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి స్మశాన వాటిక స్థలాన్ని ఎన్నో పోరాటాలు చేసి కాపాడారు. కొండపల్లి చిన్న సుబ్బారావు నియామకానికి బద్వేల్ ఆర్యవైశ్య సంఘ సభ్యులు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు

**రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు రైస్ కార్డు కుటుంబాలకు లబ్ధి**
**నాణ్యతపై రాజీ లేదు.. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు**
**జాయింట్ కలెక్టర్ వై మేఘాస్వరూప్**
**జిల్లా వ్యాప్తంగా 6.85 లక్షల రైస్ కార్డులు**

**తాళ్లపూడి/రాజమహేంద్రవరం, జులై 30, ప్రజాజ్యోతి న్యూస్** రాష్ట్ర ప్రభుత్వం పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించి, ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించేందుకు ఆగస్టు 1 నుంచి మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ (ఎం ఐ పి)అమలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు.ఈ కార్యక్రమాన్ని తూర్పు గోదావరిజిల్లాలోపారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లుపేర్కొన్నారజిల్లాలో అవసరమైన మౌలిక సదుపాయాలు, తూకం పరికరాలు, ధరల బోర్డులు ఏర్పాటు చేసి నిరంతర సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మేఘా స్వరూప్ వెల్లడించారు.ఈ కార్యక్రమం కింద జిల్లా వ్యాప్తంగా గణేష్ చౌక్, ఆర్ట్స్ కాలేజీ, క్వారీ మార్కెట్, వి.ఎల్. పురం, నటరాజ్, లాలాచెరువు, శంభునగర్, మండపేట టౌన్ వంటి ప్రాంతాల్లో ఉన్న ఎనిమిది రైతు బజార్లలో ప్రత్యేక బియ్యం విక్రయ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన రైస్ మిల్ అవుట్‌లెట్లలో కూడా ప్రత్యేక విక్రయ కేంద్రాలు ప్రారంభం కానున్నాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 6.85 లక్షల రైస్ కార్డు కుటుంబాలు ఈ మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ ద్వారా నేరుగా లబ్ధి పొందనున్నాయి. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందుబాటులోకి రావడంతో కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రతి రైస్ కార్డుకు 26 కిలోల బియ్యం అందించడం ద్వారా మధ్యతరగతి, పేద మరియు కార్మిక కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ధరల నియంత్రణతో పాటు నాణ్యమైన బియ్యం నిరంతర సరఫరా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం వల్ల వినియోగదారులకు పారదర్శకంగా, సౌకర్యవంతంగా ఈ సేవలు అందనున్నాయన్నారు.జాయింట్ కలెక్టర్ మరియు జిల్లా పౌర సరఫరాల అధికారులు రైతు బజార్లు, రైస్ మిల్ అవుట్‌లెట్లపై నిరంతర తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిల్వలు, ధరలు, తూకం, వినియోగదారుల అభిప్రాయాలను పరిశీలించి లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ధరల పెరుగుదల, నాసిరకం బియ్యం, తక్కువ సరఫరా వంటి ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు అనుకూలంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జిల్లా యంత్రాంగ బాధ్యత అని స్పష్టం చేశారు.జిల్లా పౌర సరఫరాల అధికారి వి పార్వతి వివరాలను తెలియ చేస్తూ ఈ పథకం రైస్ కార్డు కలిగిన కుటుంబాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. బియ్యం కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడు కొనుగోలు ముందు తన ఆధార్ కార్డు వివరాలను తెలియజేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రతి రైస్



కార్డుకు 26 కిలోల బియ్యం అందజేయబడుతుందని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం సూపర్ ఫైన్/స్టీమ్ బియ్యం (బిపిటి, ఆర్ ఎన్ఆర్, హెచ్ఎంటి తదితరాలు) కిలో రూ.52కు, రా రైస్ (బిపిటి) కిలో రూ.50కు విక్రయించబడుతుందని తెలిపారు.నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, నాసిరకం లేదా దెబ్బతిన్న బియ్యం విక్రయించకుండా జిల్లా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రతి విక్రయ కేంద్రంలో బియ్యం రకాలు, ధరలు, పని వేళలు, ఫిర్యాదు వివరాలు స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు

# బద్వేల్ మహబూబ్‌నగర్ స్వర్ణ వార్డులో ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ ఉమ్మడి తనిఖీలు!

**పారిశుధ్య లోపాలపై కమిషనర్ ఆగ్రహం;**
**సెక్రటరీ, మేస్త్రీలకు తాకీదులు జారీ**
**సమస్యలను 24 గంటల్లో పరిష్కరించాలని గడువు**

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూలై 30 (ప్రజా జ్యోతి)** బద్వేల్ పురపాలక సంఘం పరిధిలోని మహబూబ్‌నగర్ స్వర్ణ వార్డులో గురువారం ఉదయం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) మరియు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ, మరియు బద్వేల్ ఆర్టీసీ డిపో మేనేజర్ కలిసి



విస్తృతంగా మార్నింగ్ ఫీల్డ్ విజిట్ (క్షేత్రస్థాయి పరిశీలన) నిర్వహించారు.ఈ పర్యటనలో భాగంగా అధికారులు వార్డులోని పారిశుధ్య నిర్వహణ, రహదారుల పరిస్థితి, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, మరియు వీధి దీపాల పనితీరును స్వయంగా పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్న ఆర్డీవో చంద్రమోహన్, వాటి తక్షణ పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కమిషనర్ ఎం. కృష్ణ**

పారిశుధ్య పనుల్లో అశ్రద్ధ కనబరిచిన సదరు వార్డు శానిటేషన్ సెక్రటరీ, మరియు శానిటేషన్ మేస్త్రిలపై మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులో గుర్తించిన పారిశుధ్య లోపాలను రాబోయే 24 గంటల్లోపు పూర్తిస్థాయి లో సరిదిద్దాలని ఆదేశిస్తూ వారికి తాకీదులు (మెమోలు) జారీ చేశారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయకపోతే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన మున్సిపల్ సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సెక్షన్ హెడ్‌లు, సచివాలయ సిబ్బంది, మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సమీక్ష

**పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకురాలిగా ఉన్నత స్థాయి సమావేశం**



**కాకినాడ జిల్లా జూలై 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** భోగాపురం శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకురాలిగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆమె జన సమీకరణ,రవాణా సౌకర్యాలు,భోజన ఏర్పాట్లు,తాగునీటి వసతులపై అధికారులతో చర్చించారు.కార్యక్రమానికి తరలి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.రవాణా మార్గాలు,వాహనాల పార్కింగ్,ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్,నాయకులు కొప్పిశెట్టి బుజ్జి,మీసాల రాజు తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమన్వయం చేశారు.

## ఎలినినోపై రైతులకు అవగాహన సదస్సు



**చింతకొమ్మ దిన్నె ప్రజాజ్యోతి జూలై 30.** చింతకొమ్మదిన్నె మండలంలోని కొలుములపల్లి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో ఎలినినోపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలినినో పరిస్థితులు, వాతావరణ మార్పులు మరియు వాటి ప్రభావం పంటలపై ఎలా ఉంటుందనే అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు.భవిష్యత్తు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు అనుసరించాల్సిన శాస్త్రీయ సాగు విధానాలపై నిపుణులు సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీమతి లక్ష్మీ మాధవి మాట్లాడుతూ, ఎరువుల సమతుల్య వినియోగం, నీటి వనరుల సద్వినియోగం, పంట మార్పిడి వంటి శాస్త్రీయ పద్ధతులను రైతులు అనుసరిస్తే వాతావరణ మార్పుల ప్రభావాన్ని కొంత మేర తగ్గించవచ్చని సూచించారు.శాస్త్రవేత్త డాక్టర్ మాధవి మాట్లాడుతూ, ప్రస్తుతం ఎలినినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున వాతావరణానికి అనుకూలమైన, స్వల్పకాలిక పంట రకాలను ఎంపిక చేసుకొని సాగు చేయాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి కె. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, పంటల వాతావరణ బీమా నమోదు చేసుకునేందుకు జూలై 31 చివరి తేదీ కావడంతో ఇంకా నమోదు చేయించుకోని రైతులు తప్పనిసరిగా తమ పంటలకు వాతావరణ బీమా చేయించుకోవా లని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నీలకంఠ రెడ్డి, ఆర్ఎస్కే సిబ్బంది మరియు కొలుములపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల అవగాహన

**--హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ప్రమాదాలు తప్పవని హెచ్చరిక**



**కాకినాడ జిల్లా జూలై 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కాకినాడ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఎం కిషోర్ కుమార్ (అడ్మిన్) పర్యవేక్షణలో సినిమా హాల్ రోడ్‌లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం,ట్రిపుల్ రైడింగ్,హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు వివరించారు.అతివేగంగా వాహనాలు నడపడం,బైక్ స్టంట్లు చేయడం,మైనర్లు వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణమవుతున్నాయని హెచ్చరించారు.మార్పిడి చేసిన సైలెన్సర్ల వినియోగం వల్ల శబ్ద కాలుష్యంతో పాటు వినికిడి సామర్థ్యంపై ప్రభావం పడుతుందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా లైన్ల వినియోగంపై అవగాహన కల్పించారు.రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం చేసే వారికి గుడ్ సమరిటన్ పథకం కింద రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందజేస్తారని తెలిపారు.ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత ఉచిత వైద్యం అందుతుందని, ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు ఈ సదుపాయం వర్తిస్తుందని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్-1 సీఐ ఎన్ రమేష్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ స్పీకర్ తమ్మినేనిని పరామర్శ

– పరామర్శించిన శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, వరుదు కళ్యాణి,హర్షవర్ధన్ రెడ్డి, దుంపల రామారావు

– ప్రజా గొంతును కేసులతో అణచలేరు : బొత్స సత్యనారాయణ





**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్ :**కూటమి ప్రభుత్వం కుట్రపూరిత చర్యలతో,ఒక భూ వివాదానికి సంబంధించి నమోదైన కేసులో హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ అనంతరం స్వగృహానికి చేరుకున్న మాజీ శాసనసభ స్పీకర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తమ్మినేని సీతారాంను శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ ఎం ఎల్ సి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, పార్టీ ఉత్తరాంధ్ర విభాగం ఇన్‌చార్జి విష్ణువర్ధన్ రెడ్డి,వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యదర్శి (పార్లమెంట్) , రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర కళింగ సామాజిక వర్గ అధ్యక్షులు దుంపల రామారావు (లక్ష్మణ రావు) గురువారం ఆయన నివాసంలో పరామర్శించారు.ఈ సందర్భంగా తమ్మినేని సీతారాంతో వారు భేటీ అయి,కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.భూ వివాదానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులను తమ్మినేని వారికి వివరించారు.వివాదాస్పద భూమిని తాము చట్టబద్ధంగా కొనుగోలు చేశామని,తామే ఈ వ్యవహారంలో బాధితులమని భావించి సివిల్ కోర్టును ఆశ్రయించి దావా కూడా వేశామని తెలిపారు.సివిల్ కేసు విచారణలో ఉండగానే రాజకీయ కక్షతో క్రిమినల్ కేసులు నమోదు చేసి, అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు అనంతరం శాసన మండలిలో వైసిపి పక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడు తూ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో ప్రశ్నించే సీనియర్ నాయకులపై అక్రమ క్రిమినల్ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేయాలనే ప్రభుత్వ ధోరణి అత్యంత దుర్మార్గమైందని విమర్శించారు.రాజకీయ కక్షసాధిం పులో భాగంగానే తమ్మినేని సీతారాంపై ఈ చర్యలు చేపట్టారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి మాట్లాడుతూ,చట్టాన్ని రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. నిజాలు న్యాయస్థానాల్లో వెలుగులోకి వస్తాయని, నిర్దోషులపై తప్పుడు కేసులు మోపడం ద్వారా ప్రజల గొంతును అణచివేయలేరని స్పష్టం చేశారు.ఉత్తరాంధ్ర విభాగం ఇన్‌చార్జి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, తమ్మినేని సీతారాం వంటి అనుభవజ్ఞుడైన నాయకుడిపై రాజకీయ ప్రేరేపిత చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.చట్టపరమైన పోరాటంలో పార్టీ అండగా నిలుస్తుందని, వాస్తవాలు ప్రజల ముందుకు తీసుకువస్తామని తెలిపారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ్మినేని సీతారాంకు సంఘీభావం తెలిపారు. రాజకీయ కక్షసాధింపు చర్యలకు ప్రజలే తగిన సమయంలో గట్టి సమాధానం చెబుతారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దుంపల రామారావు మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకులను కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని అనవసరమైన వివాదాలలోకి లాగడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. వైసిపి సీనియర్ నాయకులను టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పరిపాలనా సాగిస్తుందన్నారు. తమ్మినేని సీతారాం చట్టం పై పూర్తి విశ్వాసంతో న్యాయపరంగా ముందుకు వెళ్తున్నారని ,వాస్తవాలు విచారణలో బయట పడతాయన్నారు. చట్టబద్ధమైన ప్రతీ పోరాటంలో పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# అన్నదానమే మహాదానం.. సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందిన ఓమ్మంగి యువకుడు చిలకచర్ల సురేష్‌కు అరుదైన పురస్కారాలు



**కాకినాడ జిల్లా జులై 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలం ఓమ్మంగి గ్రామానికి చెందిన యువకుడు చిలకచర్ల సురేష్ సమాజ సేవలో తనదైన ముద్ర వేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ముఖ్యంగా అయ్యప్ప భక్తులకు, నిరుపేదలకు, అవసరమైన వారికి నిరంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవాభావాన్ని చాటుకుంటున్న సురేష్‌కు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించడం పట్ల గ్రామస్థులు, సామాజిక సేవకులు, అయ్యప్ప భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సురేష్ అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు సభ్యుడిగా సేవలందిస్తూ, మానవసేవే మాధవసేవ అనే భావనతో అనేక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అయ్యప్ప మాలధారణ కాలంలో భక్తులకు అన్నదానం, తాగునీరు, అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఇతర సందర్భాల్లో కూడా పేదలు, అనాథలు, ఆపన్నులకు తన వంతు సహాయాన్ని అందిస్తున్నారు.సామాజిక సేవలను గుర్తించిన వివిధ సంస్థలు 2025 సంవత్సరానికి నంది అవార్డు గ్రహీతగా, అలాగే 2026 సంవత్సరానికి గురు సేవా పురస్కార గ్రహీత, అన్నదాన సేవా పురస్కార గ్రహీతగా చిలకచర్ల సురేష్‌ను సత్కరించాయి. సేవా దృక్పథంతో నిరంతరం ప్రజలకు అండగా నిలుస్తున్న ఆయనకు ఈ పురస్కారాలు రావడం ఓమ్మంగి గ్రామానికి గర్వకారణంగా నిలిచిందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.అన్నదానాన్ని మహాదానంగా భావించి ఎలాంటి ఆర్భాటం లేకుండా నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సురేష్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో మానవతా విలువలను పెంపొందించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.ఈ సందర్భంగా ఓమ్మంగి గ్రామ ప్రజలు, అయ్యప్ప భక్తులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు చిలకచర్ల సురేష్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

# మెగా డీఎస్సీపై దుష్ప్రచారం రుజువు చేస్తే రాజీనామా చేస్తా

-ఎమ్మెల్సీ రాజశేఖర్ డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు లేవు

--లోపాలు నిరూపిస్తే పదవి నుంచి తప్పుకుంటానని స్పష్టం వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోంది

--కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపణ

--నిరుద్యోగ భృతిపై త్వరలో ముఖ్యమంత్రి స్పష్టత ఇస్తారని ప్రకటన పెట్టుబడులతో ఉపాధి అవకాశాల కల్పన




**కాకినాడ జిల్లా జులై 30 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మండిపడ్డారు.కాకినాడ రూరల్‌లో ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేసిన ఎమ్మెల్సీ..అక్రమాలు,లోపాలు జరిగినట్లు వైసీపీ నాయకులు నిరూపిస్తే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని సవాల్ విసిరారు.కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు.డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి,ఎన్నికల హామీల అమలుకు కట్టుబడి ఉందని తెలిపారు.ఎక్కడైనా పొరపాట్లు జరిగితే నైతిక బాధ్యత వహించేందుకు ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేశారు. నిరుద్యోగ భృతి అంశాన్ని ప్రభుత్వం విస్మరించలేదని, యువతకు కేవలం భృతి అందించడం కంటే శాశ్వత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడం, పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.నిరుద్యోగ భృతి సహా వివిధ హామీల అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలో స్పష్టత ఇస్తారని వెల్లడించారు.అర్హులైన కొత్త లబ్ధిదారులకు వచ్చే నెల నుంచి గృహ సంబంధిత ప్రయోజనాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తామని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పేర్కొన్నారు.

# బాలల హక్కులపై అవగాహన సదస్సు




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జులై 30 (ప్రజా జ్యోతి)** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు కడప ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మహబూబ్ నగర్ కాలనీ ఉర్దూ పాఠశాల నందు అంగన్వాడీ టీచర్ షేక్ హసీనా ఆధ్వర్యంలో "బేటీ బచావో – బేటీ పడావో" అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థినులకు బాలల పరిరక్షణ చట్టాలు, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 వినియోగం, మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అందుతున్న వివిధ సంక్షేమ పథకాలు, సేవల గురించి విస్తృతంగా వివరించారు. విద్యార్థులు మంచి ప్రవర్తన, అలవాట్లను అలవర్చుకోవాలని, సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉంటూ చదువుపై శ్రద్ధ, ఆసక్తి, పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.?ఈ సందర్భంగా మహబూబ్ నగర్ కాలనీ పరిధిలో అంగన్వాడీ వర్కర్ షేక్ హసీనా అందిస్తున్న విశేష సేవలను, విధుల్లో ఆమె చూపిస్తున్న నిబద్ధతను సీడీపీవో శ్రీదేవి ప్రత్యేకంగా కొనియాడి, అభినందించారు.?ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ అరుణ, అంగన్వాడీ వర్కర్లు షేక్ హసీనా, షాభిరుణ్, లక్ష్మి నరసమ్మ, శైలజ, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రతిఇంటికీఅభివృద్ధి, ప్రతి గడపకీ డోన్ ఎమ్మెల్యే కోట్ల



**డోన్ (ప్రజా జ్యోతి) జూలై 30** నంద్యాల జిల్లాడోన్ పట్టణంలోని 4వ వార్డు ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న 2 ఏళ్ల నమ్మకం,సంక్షేమం, అభివృద్ధి,ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం 4వ రోజు విజయవంతంగా జరిగింది. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను వివరించారు. ప్రతి ఇంటి దగ్గరికి వెళ్లి ప్రజల్లో మమేకమై విద్యార్థులను విద్యార్థుల తల్లులను అమ్మకు వందనం పథకం అందరికీ వచ్చిందా అని అడిగి తెలుసుకుని రాని వాళ్లకు త్వరలోనే వచ్చేలా చూస్తామని మాట ఇచ్చారు ప్రజల సమస్యలను శ్రద్ధగా విని కొన్ని సమస్యలకు అక్కడికక్కడే సమస్య అధికారుల ద్వారా తీర్చారు కొన్ని సమస్యలను అధికారులకు త్వరలోనే ప్రజలకు ఇబ్బందికరంగా ఉండకూడదని అధికారులను హెచ్చరించారు, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచేలా కృషి చేస్తామని భరోసా కల్పించారు ప్రజలు ఎమ్మెల్యే మీద చూపించిన అభిమానానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నాయన పల్లె శ్రీను, పని రాజ్ హరికృష్ణ రాఘవేంద్ర గౌడ్ నాలుగో వార్డ్ ఇంచార్జ్ ఐటిఐ రాముడు భార్య,కుమారుడు స్థానిక నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కూటమి నాయకులు అభిమానులు మున్సిపాలిటీ కమిషనర్, అధికారులు, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు అని తెలిపారు.

# కార్యకర్తలను పరామర్శించిన గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్



**గుంతకల్లు జూలై 30 (ప్రజా జ్యోతి):** అనారోగ్యం కారణంగా మండలం కేంద్రంలోని వివిధ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న తెదేపా కుటుంబ సభ్యుల ను, కార్యకర్తలను గుంతకల్లు మాజీ శాసనసభ్యులు ఆర్. జితేంద్ర గౌడ్ హాస్పిటల్ వెళ్లి పరామర్శించి, ప్రత్యేకంగా డాక్టర్ ని కలిసి వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసు కోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగరాజు, శివయ్య,బండి లక్ష్మిదేవి, యాళ్లప్ప, రంగా మరియు పలువురు తెదేపా నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న పంటల బీమా గడువు


**మండల వ్యవసాయ అధికారి మహేష్..**



**కంబదూరు జూలై:31(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** పంటల బీమా నమోదు చేసుకోవడానికి జూలై 31, (శుక్రవారం) చివరి తేదీ. ఇప్పటివరకు పంటల బీమా నమోదు చేయించుకోని రైతులందరూ తప్పనిసరిగా తమ పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహేష్ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని పరిస్థితుల వల్ల కలిగే పంట నష్టాల నుండి రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంలో పంటల బీమా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అందువల్ల ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువు ముగియకముందే తమ సమీప రైతు సేవ కేంద్రం (ఆర్ ఎస్ కె), (సి ఎస్ సి) నమోదు కేంద్రంలో పంటల బీమా ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలియజేశారు.

# అఖిల్ కెరీర్‌లో ఫస్ట్ బ్లాక్‌బస్టర్.. రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన 'లెనిన్'!

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డులకెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# ఆ ముగ్గురు స్టార్‌లతో మాత్రం నటించలేకపోయాను..

**మనసులోని మాట బయటపెట్టిన శ్రీకాంత్!**

ఒకప్పుడు ఫ్యామిలీ ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ వరుస విజయాలు అందుకున్న టాలీవుడ్ ప్రముఖ నటుడు శ్రీకాంత్, ప్రస్తుతం హీరోగా నటిస్తూనే మరోవైపు క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా సత్తా చాటుతున్నారు. ఇటీవలే 'మిస్టర్ మిడిల్ క్లాస్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న ఆయన ఆబ్జెక్షన్ మై లార్డ్ అంటూ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అయితే ఇటీవలే ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీకాంత్ తన సుదీర్ఘ సినీ ప్రయాణం, నాటి అనుభవాలు, అప్పట్లో ఎదుర్కొన్న పోటీపై మనసు విప్పి మాట్లాడారు. కెరీర్ తొలినాళ్లలో విలన్‌గా ఎంట్రీ ఇచ్చి, ఆ తర్వాత లవర్ బాయ్‌గా, ఫ్యామిలీ హీరోగా ఎదిగిన శ్రీకాంత్.. ఇప్పుడు తన కుమారుడు రోషన్ హీరోగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడంతో తాను పూర్తిగా విలన్, క్యారెక్టర్ రోల్స్ వైపు మళ్లినట్లు తెలిపారు. మనం అద్దంలో చూసుకున్న తర్వాత మన పరిమితులు ఏంటో మనకు తెలిస్తే లైఫ్‌ను ఎంతో హ్యాపీగా ఎంజాయ్ చేయొచ్చు. హీరోగా రేసులో ఉండటం కంటే విభిన్నమైన పాత్రలు, యాంటీ హీరో రోల్స్ చేయడం చాలా సరదాగా ఉంటుంది, ఎలాంటి టెన్షన్ ఉండదు అని ఆయన స్పష్టం చేశారు. ఇక ఇండస్ట్రీలో పోటీ గురించి మాట్లాడుతూ.. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున వంటి అగ్ర హీరోలతో తమను తాము ఎప్పుడూ పోల్చుకోలేదని, తమకంటూ ఒక ప్రత్యేకమైన కుటుంబ కథా చిత్రాల జోనర్ ఉండేదని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తనతో పాటు జగపతి బాబు కూడా ఫ్యామిలీ సబ్జెక్టులతో బిజీగా ఉండేవారని, దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి ఎక్కువగా తమతోనే సినిమాలు చేసేవారని చెప్పారు. డేట్స్ సర్దుబాటు కాకపోవడం వల్ల కొన్ని మంచి సినిమాలు మిస్సయ్యామని, అలా ఒకసారి తాను వదిలేసిన సినిమా పెద్ద హిట్ అయిందని పాత జ్ఞాపకాలను నెరుకువచ్చారు. అలాగే తన కెరీర్‌లో మహేష్ బాబు, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్ మినహా దాదాపు టాలీవుడ్ స్టార్ హీరోలందరితోనూ స్క్రీన్ షేర్ చేసుకున్నానని శ్రీకాంత్ తెలిపారు. అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి యంగ్ జనరేషన్ హీరోలతోనూ కలిసి పనిచేశానని, భవిష్యత్తులో మిగిలిన యువ హీరోలతోనూ నటించాలని ఉందని తన మనసులోని కోరికను బయటపెట్టారు. ఇక హెయిర్ స్టైల్స్, గెటప్‌ల గురించి చెప్తూ.. గతంలో ఫ్యామిలీ మూవీస్‌లో గెటప్స్ మార్చే ట్రెండ్ లేదని, కానీ ఇప్పుడు కాలం మారుతున్న నేపథ్యంలో 'అఖండ' వంటి చిత్రాల్లో వైవిధ్యమైన గెటప్‌లను ట్రై చేశానని చెప్పారు. కన్నడ పవర్‌స్టార్ దివంగత పునీత్ రాజ్‌కుమార్ చిత్రంలో తాను చేసిన ఫ్యామిలీ విలన్ పాత్ర తనకు మంచి సంతృప్తినిచ్చిందని శ్రీకాంత్ వెల్లడించారు.



# సైబర్ బాధితుల్లో బాలీవుడ్ నటి.. ఎంత దోచుకున్నారో తెలుసా..?

సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు క్యాంపెయిన్‌ను చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే పోలీసులు, అధికార యంత్రాంగం ఎంత అవగాహన కల్పించినా సైబర్ మోసాలకు ఫుల్ స్టాప్ పడటం లేదు. సామాన్యులు, అధికారులు, సెలబ్రిటీలు సైబర్ బాధితుల జాబితాలో చేరిపోతూనే ఉన్నారు. తాజాగా బాలీవుడ్ నటి కీర్తి కుల్హరి సైబర్ మోసానికి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు నటి కీర్తి కుల్హరి మొబైల్‌ఫోన్, క్రెడిట్ కార్డ్‌ను హ్యాక్ చేసి రూ.2.4 లక్షలు దోచుకున్నారు. తన ఖాతా నుంచి డబ్బులు విత్ డ్రా కావడంతో అప్రమత్తమైన కీర్తి ముంబై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ స్కాం వెనుకున్న వ్యక్తులెవరో గుర్తించి డబ్బును రికవరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సైబర్ క్రిమినల్స్ ఇండియాలో ఎలా రెచ్చిపోతున్నారో..? తాజా ఘటన మరోసారి చెప్పకనే చెబుతోంది.





# నవ్వుతో కట్టిపడేస్తున్న ప్రగ్యా జైస్వాల్ నయా కాస్ట్యూమ్స్ చూశారా..?

కంచె, అఖండ, అఖండ 2, డాకు మహారాజ్ సినిమాలతో తెలుగులోమంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది ప్రగ్యా జైశ్వాల్. ఈ జబల్ పూర్ బ్యూటీ నెట్టింట యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్లలో జోష్ నింపుతుంటుంది. సోషల్ మీడియాలో తనకు సంబంధించిన అప్‌డేట్స్‌ను షేర్ చేసుకునే ప్రగ్యాజైశ్వాల్ తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలు కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రగ్యాజైశ్వాల్ సెలబ్రిటీ, ఫ్యాషన్ స్టైలిస్ట్ నటాషా బోత్రా అండ్ టీం డిజైన్ చేసిన ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో హొయలు పోయింది. బ్లూ అండ్ వైట్ చారలతో డిజైన్ చేసిన డ్రెస్‌లో చిరునవ్వులు చిందిస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'చారలు తిరిగి వచ్చాయని విన్నా..' అంటూ ఈ స్టిల్స్‌కు క్యాప్షన్ ఇచ్చింది. చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్టుగా ఉన్న ప్రగ్యాజైశ్వాల్ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న టైసన్ నాయుడులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది ప్రగ్యాజైశ్వాల్.

# అల్లు అర్జున్ ఫ్యాన్స్ మీట్‌తో కొత్త ట్రెండ్.. ఇప్పుడు మిగతా స్టార్ హీరోలపై అభిమానుల ఒత్తిడి!




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఫ్యాన్స్ మీట్ సోషల్ మీడియాలో భారీ చర్చకు దారితీసింది. అభిమానులతో ఒకే వేదికపై కలవడం, వారితో ఆత్మీయంగా ముచ్చటించడం, కలిసి భోజనం చేయడం, ఫోటోలు దిగడం వంటి కార్యక్రమాలతో బన్నీ తన అభిమానులకు మరపురాని అనుభూతిని అందించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు వైరల్ కావడంతో ఇప్పుడు మిగతా స్టార్ హీరోల అభిమానులు కూడా తమ అభిమాన నటులు ఇలాంటి ఫ్యాన్స్ మీట్స్ నిర్వహించాలని కోరుతున్నారు. సాధారణంగా సినిమా ప్రమోషన్స్ లేదా ప్రీ-రిలీజ్ ఈవెంట్లలో అభిమానులను కలిసే స్టార్ హీరోలు, ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించి వారితో సమయం గడపడం అరుదుగా కనిపిస్తుంది. అయితే అల్లు అర్జున్ మాత్రం తన అభిమానుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడటం, వారి అభిప్రాయాలు తెలుసుకోవడం, కలిసి ఫోటోలు దిగడం ద్వారా అందరి ప్రశంసలు అందుకున్నారు. సెలబ్రిటీ హోదాలో ఉన్నప్పటికీ ఎంతో సింపుల్‌గా అభిమానులతో కలిసిపోవడం సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీసింది. ఈ ఫ్యాన్స్ మీట్‌ను కేవలం తెలుగు రాష్ట్రాల అభిమానులకే పరిమితం చేయకుండా, తమిళనాడు, కేరళ, కర్ణాటకతో పాటు హిందీ బెల్ట్‌కు చెందిన అభిమానులను కూడా ఆహ్వానించడం విశేషంగా నిలిచింది. పాన్ ఇండియా స్థాయిలో అభిమానులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా అల్లు అర్జున్ తన అభిమానుల పట్ల ఉన్న అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారు. అంతేకాకుండా, కొందరు అభిమానులకు హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సహాయక కార్యక్రమాలు అందించడం కూడా ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ కార్యక్రమం తర్వాత సోషల్ మీడియా వేదికగా పలువురు అభిమానులు తమ అభిమాన హీరోలను ట్యాగ్ చేస్తూ, "మా హీరో కూడా ఇలాంటి ఫ్యాన్స్ మీట్ నిర్వహించాలి", "మాతో కూడా ఒక రోజు గడపాలి" అంటూ పోస్టులు చేస్తున్నారు. పలువురు సినీ అభిమానులు కూడా స్టార్ హీరోలు తరచూ అభిమానులతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే వారి మధ్య అనుబంధం మరింత బలపడుతుందని అభిప్రాయపడుతున్నారు. అల్లు అర్జున్ చేపట్టిన ఈ కార్యక్రమం తర్వాత సినీ వర్గాల్లో కూడా ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అభిమానులతో నేరుగా కలిసే అవకాశాలు పెరిగితే హీరోలకు మరింత సానుకూల ఇమేజ్ ఏర్పడుతుందని, సోషల్ మీడియాలోనూ మంచి స్పందన వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అభిమానుల అభిమానం కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, వ్యక్తిగత అనుబంధంగా మారేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అంటున్నారు. అల్లు అర్జున్ నిర్వహించిన ఈ ఫ్యాన్స్ మీట్ ఇప్పుడు టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్‌కు నాంది పలికిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,